నవతెలంగాణ
వరంగల్
బుధవారం | జూన్ 12, 2024 | www.navatelangana.com
1

వరద ముంపు నివారణకు పటిష్టచర్యలు : కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

నవతెలంగాణ-వరంగల్



వరద ముంపు నివారణకు పటిష్ట చర్యలు చేప ట్టాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాక డే ఇంజనీరింగ్, సానిటేషన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హ నుమకొండ పరిధిలోని లోతట్టు ప్రాంతాలైన రామకృష్ణ కాల నీ, ఎస్‌బీహెచ్ బ్యాంక్ కాలనీ, ప్రగతినగర్, కుడా కాలనీ, స మ్మయ్యనగర్, నయీంనగర్, బొక్కలగడ్డ, హన్మకొండ బస్ స్టాండ్ రోడ్ ప్రాంతాలతోపాటు వరంగల్ పరిధి లోని లోత ట్టు ప్రాంతాలైన రామన్నపేట 12 మోరీల ప్రాంతం, ఎన్టీఆర్ నగర్, సంతోష్ మాతా కాలనీ, ఖమ్మం బై పాస్ రైల్వే బ్రిడ్జి, బిఆర్ నగర్, కడిపి కొండ రోడ్ ప్రాంతం, డికే నగర్ గరీబ్ నగర్, మేసయ్యనగర్, గాంధీనగర్ ప్రాంతాల్లో పర్యటించి చే పట్టాల్సిన చర్యలపై కమీషనర్ అధికారులకు తగు సూచన లు చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ భారీవర్షాలు కురిసే క్రమంలో ఇంజనీరింగ్, శానిటేషన్ అ ధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ సమష్టితో పని చేసి నీరు నిల్వఉండకుం డా చర్యలుచేపట్టాలని ప్రధానంగా బల్దియా పరిధిలోని లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించాలని, నీరునిల్వ ఉంటే అవస రం మేరకు కచ్చా కాలువలుతీసి నీరు ఆగకుండా చూడాలని, డ్రైన్‌లలో నీరునిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు సిల్ట్ తొలగించా లన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ కృష్ణారావు, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, డిప్యూటీ కమిషనర్‌లు రవీందర్, కృష్ణారెడ్డి, ఈఈ లు రాజయ్య, శ్రీనివాస్ ఏసిపి శ్రీనివాసరెడ్డి, శానిటరీ సూపర్ వై జర్‌లు సాంబయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

బిషప్ ఉడుమల బాలను కలిసిన ఎంపీ కావ్య

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి



వరంగల్ పార్లమెంటు సభ్యురాలిగా విజయం సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య వరంగల్ బిషప్ డాక్టర్ ఉడుమల బాలను మర్యాదపూర్వకంగా కలిశారు.మంగళవారం సాయంత్రం ఫాతిమానగర్‌లోని బిషప్ హౌజ్‌లో బిషప్ బాలకు పూలగుచ్ఛమిచ్చి ఆశీస్సులు తీసుకున్నారు. బిషప్ ఉడుమలబాల, ఎంపిగా గెలిచిన డాక్టర్ కావ్యకు శాలువ కప్పి సన్మానించారు. అనంతరం ప్రార్థన చేసి దీవించారు. ఏ సమస్యలున్నా నా దృష్టికి తీసుకురావాల్సిందిగా కావ్య బిషప్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కావ్య వెంట ఆమె భర్త డాక్టర్ నజీర్ తదితరులున్నారు.

కలెక్టర్‌ను కలిసిన గెజిటెడ్ అధికారులు

నవతెలంగాణ-వరంగల్



తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమ్మడి వరంగల్ జిల్లా కో-ఆర్డినేటర్ ఎన్నమనేని జగన్ మోహన్‌రావు ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యని కలిసి ఇటీవల జరిగిన పార్లమెంట్,అసెంబ్లీ ఎలక్షన్లను విజయవంతంగా పూర్తి చేసినందుకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరగటానికి జిల్లా అధికారులతో పాటు గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారులు, ఉద్యోగస్తులందరూ పూర్తిసహాయ సహకారాలు అందించడం వల్లనే ఈ ఎన్నికలను దిగ్విజయంగా పూర్తి చేయగలిగామని కావున వారందరికీ అభినందలు తెలియజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో డీసీఓ సంజీవరెడ్డి, సీఈఓ రాంరెడ్డి, కుమార్, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఈగ వెంకటేశ్వర్లు, సురేష్ కుమార్, చంద్రశేఖర్,మాధవరెడ్డి, రాజేష్ కుమార్, నాగ నారాయణ పాల్గొన్నారు.

ఉత్తమ లక్ష్య సాధన కోసం కృషి చేయాలి

నవతెలంగాణ-పర్వతగిరి



విద్యార్థులు ఉత్తమ లక్ష్య సాధన కోసం కృషి చేయాలని మండల నోడల్ అధికారి జి. లింగారెడ్డి సూచించారు. మండలంలోని జెడ్పీహెచ్ఎస్ గోపనపల్లి పాఠశాల విద్యార్థులు మహాత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ కళాశాలకు ఎంపికైన సందర్భంగా మంగళవారం విద్యార్థులను ఆయన అభినందించారు. అనంతరం మండల నోడల్ అధికారి మాట్లాడుతూ ఈ పాఠశాల ఈ సంవత్సరం పదవ తరగతి ఫలితాలలో 100శాతం ఉత్తీర్ణత సాధించడమే కాక ఐదుగురు విద్యార్థులు బి.స్నేహ, ఎ.రక్షిత,ఎ.శ్రీజ, పి.అక్షిత, కే.ఆకాష్‌లు రెసిడెన్షియల్ కళాశాలకు ఎంపికవడం హర్షణీయమన్నారు. ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా జెడ్పీఎస్ఎస్ గోపనపల్లి నుండి బదిలీఅయిన ఉపాధ్యాయులు జంపాల లింగమూర్తి, అబ్దుల్ గఫార్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాసం శ్రీనివాస్, సదానందం, వి.వాసవి, ఎల్.శ్రీధర్, ఎండి.ఫరీద్, పురుషోత్తం రావు, నాగేశ్వరచారి తదితరులు పాల్గొన్నారు.

విద్యా హక్కును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-పర్వతగిరి

విద్యా హక్కును సద్వినియోగం చేసుకుని బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతూ మండలం లోని గోపనపల్లి లో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి అందరు కలిసి మంగళవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని బడిఈడు పిల్లల తల్లిదండ్రులను కలిసి పాఠశాలకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మేకిరి దామోదర్,గుండు కరుణాకర్, నాసం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మిషన్ భగీరథ సర్వే

నవతెలంగాణ-ఖానాపురం




ప్రతి ఇంటికి మంచినీరు అందించే విధంగా ప్రభుత్వం మిషన్ భగీరథపై సర్వే చేపట్టింది. సర్వేలో ప్రతి ఇంటికి నల్ల కలెక్షన్ ఉందా ? లేదా ? అనే విషయాన్ని పరిశీలించాల్సి ఉంది. ప్రభుత్వం మిషన్ భగీరథ సర్వే కో సమే ప్రత్యేక యాప్ రూపొందించింది. యాప్‌పై గ్రామంలో అందుబాటులో ఉన్న పంచాయతీ కార్యదర్శులకు, సిఎ, ఆశ కార్యకర్తలకు ఉన్నత అధికా రులచే ప్రత్యేక శిక్షణ అందించారు. సర్వేలో భాగంగా ప్రతి ఇంటిని క్షేత్ర స్థాయిలో సందర్శించి నల్ల కలెక్షన్ ఉందా లేదా అనే విషయాన్ని గమనించి కుటుంబ సభ్యుల ఫోటోతో సహా ఆప్ నందు పొందుపరుస్తారు. మిషన్ భగీరథ నల్ల కలెక్షన్ లేని వాటిని సైతం గుర్తించి నమోదు చేయాల్సిందిగా అధికారులు సూచించారు.

ప్రస్తుతం వస్తున్న భగీరథ నీరు అందుకు అనుగుణంగా నీటి సరఫరా అవుతుందా లేదా అనే కోణంలో పరిశీలించాల్సిన పరిస్థితి అధికారులకు ఏర్పడింది. ప్రతి ఇంటికి మంచినీరు అందించడమే లక్ష్యంగా మిషన్ భగీరథ సర్వే చేపట్టినట్లు అధికారుల నుండి సమాచారం.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


నవతెలంగాణ-నెక్కొండ



నర్సంపేట ఎమ్మెల్యే ఎస్డీఎఫ్ నిధుల నుండి రూ. 4 లక్షలతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణం పనులను మంగళవారం పిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి మండలం అమీన్‌పేటలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గ్రామాల్లో మరిచిన అభివద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేసి చూపుతామన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్, నాయకులు కుసుమ చెన్నకేశవులు, రాచకొండ రఘు, రావుల మహిపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ గరికపాటి హనుమంతరావు, చిలుపూరి యాకయ్య, పిఆర్ ఏఈ రాజ్‌కుమార్, సుధాకర్, జానీబాషా, యాకుపాషా, గరికపాటి కోటేశ్వరరావు, వెంకట కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు, బదిలీల సక్రమంగా చేపట్టాలి

నవతెలంగాణ-నెక్కొండ



ఉపాధ్యాయ పదోన్నతులు , బదిలీల ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని, పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు రోస్టర్ పాటించా లని డిఈఓ ఉపాధ్యాయ సంఘం నేతలు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ జిల్లా శాఖ అధ్యక్షులు పరశురాం, ప్రధాన కార్యదర్శి ముడుసు నరసయ్య మాట్లాడుతూ ఓపెన్ సీనియార్టీలో ఉన్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులను ఓపెన్‌లో భర్తీ చేయాలని, రిజర్వేషన్ కోటాలో రిజర్వ్ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులతోనే భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్కాల పరశురామ్, మూడు నరసయ్య గోపాలరావు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలి : మంత్రి తుమ్మల



నవతెలంగాణ-నర్సంపేట

రైతులు వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన సాంకేతిక పరిజ్ఞానం పట్ల అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని రైతువేదికలో నిర్వహించిన 'రైతు నేస్తం' వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాకలెక్టర్ పీ.ప్రావీణ్య, జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాల్,తదితర అధికారులు హాజరయ్యారు. రైతులను ఉద్దేశించి మంత్రి తుమ్మల మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో విస్తరణ కార్యకలాపాలు బలోపేతం చేయడం కొరకు, రైతులలో నూతన సాంకేతిక పరిజ్ఞానంపై విస్తత అవగాహన కల్పించుటకు పలు సూచనలు చేశారు. రైతునేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులు ఆవిష్కరణలు క్షేత్ర స్థాయిలోకి తీసుకెళ్లడం కోసం ప్రతి మంగళవారం, శుక్రవారం విస్తరణాధికారులు రైతులతో రైతునేస్తం పేరిట రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాగు రంగానికి సాంకేతికతను అనుసంధానం చేస్తూ రైతుసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్నట్లు, రైతులు వ్యవసాయ రంగంతో పాటు అనుబంధంగా చేపలు పాడి పశువుల పెంపకం వంటివి చేపట్టాలన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి పొందేలా రైతులు నూతన అలవాట్లను విధానాలను అలవాటు చేసుకోవాలని సూచించారు. రైతు నేస్తం కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు అధికారులు పాల్గొంటారని, రైతులు సమస్యలను వారి దృష్టికి పరిష్కరించుకోవాలన్నారు.

- రైతునేస్తాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య





విత్తన దుకాణాల ఆకస్మిక తనిఖీ ....

పట్టణంలోని పలు విత్తనాలు విక్రయించే డీలర్ షాపులను, ఆగ్రో సెంటర్లను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాల్‌తో కలిసి. విత్తనాల, యూరియా స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎవరు నకిలీ విత్తనాలు విక్రయించిన కఠిన చర్యలు తప్పవని, సంబంధిత షాప్‌ను సీజ్‌చేస్తామని హెచ్చరించారు. రైతులు ప్రసిద్ధిలేని విత్తనాలు కొనుగోలు చేయకూడదని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాల్, ఆర్డీఓ కృష్ణవేణి, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

అమ్మఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులను త్వరితంగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. మంగళవారం నర్సంపేట మండలంలోని రామవరం ఎంపీపీఎస్, నర్సంపేట ఎంపీపీఎస్, నర్సంపేట ఎంపీపీఎస్ ఉర్దూ మీడియం పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు గుర్తించిచేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా రూ.24 కోట్ల వ్యయంతో సుమారు 556 ప్రభుత్వ పాఠశాలలలో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా అభివృద్ధి పనులను గుర్తించి చేపట్టామన్నారు. అందులో కొన్ని పూర్తికాగా, మరికొన్ని పనులు తుదిదశలో ఉన్నాయని వాటిని పాఠశాలల ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, నోటుబుక్కులు అందజేశామన్నారు. మహిళా సంఘాలచే కుట్టిన ఏకరూప దుస్తులను పాఠశాల ప్రారంభం రోజున విద్యార్థులకు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి, సెక్టోరియల్ ఆఫీసర్ సుధీర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీఓ, ఆదర్శకమిటీ పాల్గొన్నారు.

అమ్మఒడిలో చదువుల బడి పురోగమించేనా..!

- బడుల అభివృద్ధిలో కమిటీలదే కీలకపాత్ర
- ఈ విద్యాసంవ్సరం విద్యార్థుల సంఖ్య పెరిగేనా..
- ఈసారైనా మౌలిక వసతులు మెరుగయ్యేనా..
- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం



నవతెలంగాణ-వరంగల్

ఇటీవల ఏర్పడిన నూతన ప్రభుత్వం ప్రభుత్వ బడులను బలోపేతం చేయడానికి ఆదర్శఅమ్మ బడికమిటీలను స్థానికంగా ఉన్న మహిళా సమైక్య గ్రూపులకు అప్పగించింది. మహిళా సమైక్య గ్రూపులు పాఠశాల విద్యార్థుల సంఖ్యను పెంచి మౌలిక వసతులను ఏర్పాటు చేసేవిధంగా బడుల బాధ్యతను అమ్మ ఆదర్శ కమిటీలు నిర్వహించేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ఈ క్రమంలో గతంతో పోలిస్తే సర్కారు బడుల్లో ఈసారైనా తరగతులకు సరిపడా విద్యార్థుల సంఖ్య నమోదు అవుతుందా అనే సంశయం లేకపోలేదు. పాఠశాలలో విద్యార్థులకు కావలసిన మౌలిక వసతుల్లో పూర్తిస్థాయి అభివృద్ధి జరుగుతాయా ? అనేది చూడాల్సిందే. వరంగల్ జిల్లాలో దాదాపు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గి ఉండడం కొన్ని పాఠశాలలను మూసివేసే దిశగా ఉన్నందున ఏ ప్రభుత్వ పాఠశాలనైనా మూసివేయకుండా సంబంధిత పాఠశాల పరిధిలోని బడిఈడు పిల్లలను తప్పకుండా ఆ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించే విధంగా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల సహకారంతో అమ్మ బడి కమిటీలు పూర్తిస్థాయిలో పనిచేసేలా ప్రత్యేక జీవోలను తీసుకురావడం జరిగింది. మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు స్థానికంగా ఉన్నటువంటి మహిళా సమైక్య గ్రూపులే బాధ్యత తీసుకుంటున్నారు. స్థానికంగా ఉన్న విద్యార్థులను ఈ మహిళా సమైక్య గ్రూపులు పాఠశాలల్లో చేర్పించే విధంగా నిరంతరం కృషి చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ప్రస్తుతం బడిబాట కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రధానో పాధ్యాయులు, స్థానిక మహిళ సమైక్య గ్రూపులు పాల్గొంటున్న సందర్భాలు లేకపోలేదు. క్షేత్రస్థాయిలో అమ్మ ఆదర్శ కమిటీలు ప్రభుత్వ బడులను బలోపేతం చేసే విధంగా ప్రత్యేక శ్రద్ధవహిస్తే మాత్రం గతంలోని సర్కారు బడుల పూర్వ వైభవం బడి పిల్లలతో నిండుగా సందడిగా ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదేమో.

గతంలో ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులు అనుకున్న స్థాయిలో లేకపోవడం విద్యార్థులు కూడా ప్రైవేట్ పాఠశాలలవైపు మొగ్గు చూపడం పాఠశాల ప్రారంభానికి ప్రైవేట్ పాఠశాలలు తమ ప్రచారాన్ని ముమ్మరం చేసుకుని తమ వైపు మళ్లించుకోవడం జరిగింది. వాటిని నివారించే దిశగా ప్రస్తుత ఆదర్శ అమ్మ కమిటీలు ఎంత వరకు సఫలీకతమవుతాయో సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్యను ఎలా పెంచుతాయో చూడాల్సిందే..

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు సకాలంలో అందేనా..!

ప్రస్తుత విద్యా సంవత్సరానికి పాఠశాల పునః ప్రారంభం అవుతుండడంతో విద్యార్థుల పాఠ్యపుస్తకాలను సకాలంలో పంపిణీ చేయాలనీ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఇప్పటికే చాలా పాఠ శాలలో నిల్వచేయడం జరిగింది. అయితే పూర్తిస్థాయిలో విద్యార్థులందరికీ అందే విధంగా పుస్తకాలు ఉంటే, అకాడమిక్ ఇయర్‌కు సరిపడా పుస్తకాలు ప్రారంభంలోనే అందించే దిశగా చొరవ తీసుకోవాల్సిన ఉంది. గతంలో సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులకు సరైన సమయానికి అందరికీ పరిపూర్ణంగా పాఠ్యపుస్తకాలు అందలేదనే ఆరోపణలు ఉన్నాయి. మొత్తం పాఠ్యపుస్తకాలు రావడా నికి విద్యా సంవత్సరం పూర్తయ్యే వరకు కొనసాగడం గమనార్హం. విద్యార్థులకు ఏకరూప దుస్తులు ఇచ్చే విషయంలో సరి సమానతలు లేకపోవడం హెచ్చుతగ్గుల వల్ల దుస్తుల పంపిణీలో కొంత ఆలస్యమైన సంగతి విధితమే ప్రస్తుతం దుస్తుల విషయం కూడా అమ్మ ఆదర్శ కమిటీలకు స్థానికంగా వారికి అప్పజెప్పడం నేరుగా విద్యార్థుల కొలతలు తీసుకొని వారికి సరిపడా దుస్తులు అందజేయడంలో సఫలీకత అవుతారో లేదో చూడాల్సిందే. ఏది ఏమైనప్పటికీ హెచ్ఎంలు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ పరస్పర సహకారంతో సమన్వయంతో పాఠశాల పున ప్రారంభానికి విద్యార్థులకు ఎలాంటి అసౌకార్యాలు లేకుండా సర్కారు బడులను బలోపేతం చేసే దిశగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు పోతారని ఆశిస్తున్న వారు లేకపోలేదు.

సర్కార్ బడులను బలోపేతం చేస్తాం : వాసంతి, జిల్లా విద్యాశాఖ అధికారి



ప్రభుత్వ పాఠశల్లో చదివే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, వర్క్ బుక్స్ లు, ఏకరూప దుస్తులు వచ్చాయి.వాటిని పిల్లలకు అందజేస్తాం. జీరో స్ట్రెంత్ ఉన్న పాఠశాలను పునః ప్రారంభం చేస్తాం. డిప్యూటేషన్ మీద ఉపాధ్యాయులను సర్దు బాటు చేస్తాం. ప్రధానోపాద్యాయులు, అమ్మ ఆద ర్శ కమిటీలతో సమన్వయం చేసి విద్యార్థులను పెంచే దిశగా ముందుకు వెళుతున్నాం. మెరుగైన విద్యతోపాటు, బడుల్లో మౌలిక వసతులు కల్పించుటకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

- యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కే.సోమశేఖర్



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్‌లో వున్న నాలుగు విడతల కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. సోమశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం హన్మకొండ యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి జిల్లా అధ్యక్షులు సిహెచ్ రవీందర్‌రాజు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో సోమశేఖర్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా వెంటనే డిఎలను విడుదల చేయాలని కోరారు. అలాగే పెండింగ్‌లో వున్న బిల్లులను విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ ప్రభుత్వం ఇప్పటి వరకు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఏ ఒక్క హామిని నెరవేర్చలేదన్నారు. వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. గత ప్రభుత్వం ప్రకటించిన విధంగా ప్రాథమిక పాఠశాలల్లో 10వేల ప్రధానోపాధ్యాయ పోస్టులు వెంటనే మంజూరు చేయాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న బదిలీలు, పదోన్నతుల్లో ఎలాంటి తప్పులు దొర్లకుండా సీనియారిటీ లిస్టులు తయారు చేయాలన్నారు. ఉపాధ్యాయుల నుండి వచ్చిన అప్పీల్స్‌ను వెంటనే పరిష్కరించాలని కోరారు. పాఠశాలలు తెరవగానే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, నోట్స్ వెంటనే అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సర్వీస్ పర్సన్స్‌ను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలు సక్రమంగా నడపడానికి గ్రాంట్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. గురుకుల ఉపాధ్యాయులు, మోడల్ స్కూల్స్, కెజిబివి ఉపాధ్యా యుల బదిలీలు నిర్వహించాలని, కెజిబివి సిబ్బందికి బేసిక్ పే మంజూరు చేయాలన్నారు.

ఈ సమావేశంలో టిఎస్ యూటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు, జిల్లా ఉపాధ్యక్షులు ఎ.రాజారామ్, ఎస్ జ్యోతి, కోశాధికారి డి. కిరణ్‌కుమార్, కార్యదర్శులు సిహెచ్.లింగారావు, డి.నవీన్‌కుమార్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ కె సదానందం, జి. భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌లు అప్పగించిన పోలీసులు

నవతెలంగాణ-నెక్కొండ

మండలంలో మొబైల్ ఫోన్లో పోగొట్టుకున్న బాధితులు నలుగురికి ఫోన్లను రికవరీ చేసి అప్పగించినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫోన్‌లు పోయిన విషయాన్ని బాధితులు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా సీఈఐ ఆర్ ద్వారా విచారణ జరిపి రూ.లక్ష రూపాయల విలువైన మొబైల్ ఫోన్ల ను రికవరీ చేసి బాధితులు ఎర్రబో తుల రమేష్, సదానంద చారి, రాజబోయిన వెంకన్న, వెంకన్నలకు మంగళవారం అప్పగించారు. బాధితులు మొబైల్ ఫోన్లు రికవరీ చేయడంతో పోలీసులకు కతజ్ఞతలు తెలిపారు.

మండలంలో కానరాని 'ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట'

నవతెలంగాణ-చెన్నారావుపేట

నేటి నుండి పాఠశాలలు పున:ప్రారంభం కానున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం బడి ఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేందుకు బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం విద్యా బోధనపై ప్రజల అవగాహన కల్పించి బడిబయట పిల్లలని బడిలో చేర్పించే విధంగా చర్యలు చేపట్టాలని ఈనెల 6 నుంచి 19 వరకు కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించింది, చెన్నారావుపేట మండలంలో మొదటిరోజు గురువారం నామమాత్రంగానే తప్ప ఎక్కడ ఈ కార్యక్రమాన్ని నిర్వహించకపోవడం విమర్శలకు తావిస్తుంది. బడిబాట నిర్వహించాల్సిన మండల విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో యేటా ఒక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మూతపడడం పరిపాటిగా మారింది. దీంతో ప్రైవేట్ పాఠశాలల్లో చదివించలేని నిరుపేద విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు ఇందుకు తోడుగా పాఠ్యపుస్తకాలు ఏకరూప దుస్తులు సైతం పాఠశాలకు ఇంకా చేరలేదు. ఈ నెల 12 నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయి ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వాల్‌పోస్టర్లు కరపత్రాలు ముద్రించి గ్రామాల్లో పంచుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉన్న మౌలిక వసతులు నాణ్యమైన విద్యపై అవగాహన కల్పించాలి. కానీ మండలంలో 6 జిల్లా పరిషత్తులు, ఒక్క మోడల్ స్కూలు పాఠశాల, ఒక కస్తూర్బా ఆశ్రమపాఠశాల, 39 ప్రాథమిక పాఠశాలల్లో ఎక్కడ కాన రాలేదు.



బడిబాట లక్ష్యాలు ఇవి..

బడిఈడు పిల్లలను గుర్తించి సమీప పాఠశాలలో పేరు నమోదు చేయడమే కాకుండా ప్రాథమిక పాఠశాలలో సంఖ్యనమోదు పెంచి గుణాత్మక విద్యనందించాలి. సమాఖ్య మహిళా సంఘాలు, అమ్మఆదర్శ కమిటీలు, సహజ భాగస్వామ్యంతో పాఠశాలలను బలోపేతం చేయడం అంగన్వాడి కేంద్రాల్లో ఐదేళ్ల పిల్లలను గుర్తించి సమీప పాఠశాలలో చేర్పించడం విలేజీ ఎడ్యుకేషన్ రిజిస్టర్ అప్డేట్ చేయడం 5 నుండి 7వ తరగతి పూర్తిచేసిన విద్యార్థులను ఉన్నత తరగతులు చేర్పించడం, విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలలో ప్రత్యేక ప్రాణాలిక ద్వారా తల్లిదండ్రుల భాగస్వామ్యంతో నమోదు పెంచడం, బడిడు పిల్లలను గుర్తించి వయసుకు తగిన తరగతి నమోదు చేయడం, బాలిక విద్య ప్రాముఖ్యతపై ప్రత్యేకశ్రద్ధ వహించి వారిని పాఠశాలలో చేర్పించాలి.

ఉపాధ్యాయుల కార్యక్రమాలు ఇలా..

బడిబాట ప్రారంభం 6 నుంచి 11వ తేదీ వరకు అన్నిగ్రామాల్లో ఆవాసప్రాంతాల్లో ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు పాఠశాల కమిటీ సభ్యులు ఇంటింటా ప్రచారంతోపాటు ర్యాలీలు నిర్వహించి బ్యానర్లు, పోస్టర్లు, కరపత్రాల పంపిణీ చేసి బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలని గుర్తించి వారిని భవిత కేంద్రాల్లో చేర్పించాలి. పాఠశాలలో 12న పున: ప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠశాలలను అలంకరించి పండుగ వాతావరణం కల్పించడం, విద్యార్థి విద్యార్థులకు తల్లిదండ్రులకు స్వాగతం పలకడం, 13న విద్యార్థుల అక్షరాస్యత విద్యార్థుల అభ్యాసన సమర్థ్యాన్ని పెంపొందించే విధంగా తొలిమెట్టు కార్యక్రమాలపై తల్లిదండ్రులకు అవగాహన, 14 న బాలసభ పాఠశాల స్థాయిలో పిల్లలు కమిటీలు క్లబ్బులు ఏర్పాటు, 15న ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి వారిని భవిత కేంద్రాల్లో చేర్పించడం బాల కార్మికులు గ్రామాల్లో లేరని నిర్ధారించుకోవడం, 16న పాఠశాలలో ఆంగ్లమాధ్యమంపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం, 19న పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులను పాఠశాలకు ఆహ్వానించి ఉన్నత విద్య, వారి భవిష్యత్తుపై అవగాహన కార్యక్రమాలు,చదువుల్లో క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమాలు చేపట్టాల్సిన అ వసరంఉంది. మండలంలో కానరాని బడిబాట కా ర్యక్రమాలతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హనుమకొండ
బుధవారం | జూన్ 12, 2024 | www.navatelangana.com

మహిళా కార్మికులపట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తే కఠినంగా శిక్షించాలి

- సీఐటీయూ శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ ఎన్.రజిత



నవతెలంగాణ-నయింనగర్

మహిళా కార్మికుల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తే కఠినంగా శిక్షించాలని హనుమకొండ జిల్లా సిఐటియు శ్రామిక మహిళ కన్వీనర్ ఎన్.రజిత అన్నారు. మంగళవారం సిఐటియు హనుమ కొండ జిల్లా మునిసిపల్ రంగంలోని శ్రామిక మహిళ విభాగం నూతన కమిటీ శ్రీలత అధ్యక్షతన రాంనగర్‌లోని సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన హనుమకొండ జిల్లా సిఐటియు శ్రామిక మహిళ కన్వీనర్ ఎన్.రజిత మాట్లాడుతూ అన్ని రంగాల్లో పని చేసే కార్మికుల్లో మహిళాకార్మికులపట్ల పురుష కార్మికులు, అధికారులు, ఉన్నతాధికారులు మహిళలపై అనేక అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని మే 23న జిహెచ్‌ఎంసి పరిధిలోని కుత్బుల్లాపూర్ మున్సిపాలిటీలో ఒక సూపర్వైజర్ మహిళా కార్మికురాలని, అనేక రకాలుగా బెదిరించి, బలవంతంగా లొంగ తీసుకునే ప్రయత్నం చేయగా ఈ విషయాన్ని సిఐటియు శ్రామిక మహిళ విభాగం ఆధ్వర్యంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఆ కామాంధుడిని సస్పెండ్ చేయించడం జరిగిందని వివరించారు. ఇదేవిధంగా అన్ని రంగాల్లో మహిళా కార్మికులు, ఉద్యోగుల పట్ల సోదరి భావంతోకాక అసభ్యకరంగా, ద్వంద్వర్థాల మాటలతో ప్రలోభపెట్టి, మహిళా కార్మికులు, ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ముఖ్యంగా మున్సిపల్ రంగంలో మహిళా పారిశుధ్య కార్మికులు పైఅధికారులతో తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నట్లు మా శ్రామిక మహిళ విభాగం దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ రంగంలోనూ, మరే రంగంలోనైనా మహిళా కార్మికులు, ఉద్యోగులపట్ల అసభ్యంగా వ్యవహ రించిన వారిపై చట్టరీత్యాకఠినంగా శిక్షించే వరకు సిఐటియు ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని ఆమె హెచ్చరించారు.

రైతునేస్తం రైతులకు వరం : మంత్రి తుమ్మల



నవతెలంగాణ-సుబేదారి

రైతు నేస్తం రైతులకు వరమని హైదరాబాద్ నుంచి రైతునేస్తం వీడియోకాన్ఫరెన్స్‌లో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ కమిషనరేట్ పరిధి నుంచి డైరెక్టర్ గోపి, వరంగల్ వ్యవసాయ పరిశోధనాస్థానం నుంచి శాస్త్రవేత్త ప్రశాంత్ ఈ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ముఖ్యంగా ఈ కార్యక్రమం పత్తి పంట అధికసాంద్రత, సాగు గూర్చి శాస్త్రవేత్తలు సలహాలు అందిస్తూ, అనుభవజ్ఞులైన రైతులతో ఇతరరైతులకు అవగాహన కల్పించారు.అధిక సాంద్రత పత్తి పంట సాగు ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. సేంద్రియ ఎరువుల వ్యవసాయంపై పద్మ శ్రీ చింతల వెంకట్ రెడ్డి చీడ పీడలను తట్టుకునే ద్రావణాల గూర్చి వివరించారు.జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ రైతునేస్తం కార్యక్రమం రైతులకు చాలా ఉపయోగకరమైనదన్నారు. మేలైన విత్తనాల ఎంపిక, సాగు పద్ధతులు,నూతన సాగు పద్ధతులు, ఎరువుల వాడకం తదితర అంశాలు తెలుసుకోవచ్చు అని అన్నారు. వ్యవసాయ అధికారులు రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ సింగ్, ఏడిఏ దామోదర్ రెడ్డి, ఏఓలు శ్రీలత,పద్మ, కవిత, రాజ్ కుమార్,శ్రీధర్ రెడ్డి, లక్ష్మ రెడ్డి,అనురాధ, మాధవి, కమలాకర్,ఏ ఈ వోలు రైతులు పాల్గొన్నారు.

15లోగా భగీరథ సర్వే పూర్తి చేయాలి : డీపీవో



నవతెలంగాణ-శాయంపేట

ఈనెల 15లోగా మిషన్ భగీరథ పథకంపై ఇంటింటి సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని డిపిఓ రమాకాంత్ అధికారులను ఆదేశించారు. మండలంలోని తహరాపూర్, శాయంపేట గ్రామాల్లో అంగన్వాడీ టీచర్లు, ఐకెపి సీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు మిషన్ భగీరథ పథకంపై ఇంటింటి సర్వే చేపడుతుండగా మంగళవారం డిపిఓ ఆకస్మికంగా సందర్శించి సర్వే తీరును పరిశీలించారు. ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేపట్టి, ఆన్లైన్లో వివరాలు పొందుపరుచుతున్నారా అనిఅడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు నర్సింహులపల్లి, ఆరేపల్లి, సాదోనిపల్లి, హుస్సేన్ పల్లి గ్రామాలలో సర్వే పూర్తయినట్లు అధికారులు డిపిఓకు వివరించారు. అన్ని గ్రామాల్లో సోమవారం నుండి సర్వే ప్రారంభమైందని, త్వరలో పూర్తి చేస్తామని డిపిఓకు వివరించారు. ఇంటి, నల్లా పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలను గ్రామ ప్రత్యేక అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ సోమేష్, ఎంపీఓ రంజిత్ కుమార్, పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన టీజీఓలు



నవతెలంగాణ-సుబేదారి

తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉమ్మడి వరంగల్ జిల్లా కో-ఆర్డినేటర్ ఎన్నమనేని జగన్ మోహన్‌రావు ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసారు. ఇటీవల జరిగిన పార్లమెంట్,అసెంబ్లీ ఎలక్షన్లను విజయవంతంగా పూర్తి చేసినందుకు పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరగటానికి జిల్లా అధికారులతో పాటు గెజిటెడ్ అధికారులు, ఉద్యోగస్తులందరూ పూర్తి సహాయ సహకారాలు అందించడం వల్లనే ఈ ఎన్నికలను దిగ్విజయంగా పూర్తి చేయగలిగామని కావున వారందరికీ అభినందలు తెలియజేయగలరని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్ కుమార్,ఈగ వెంకటేశ్వర్లు, సురేష్ కుమార్, అన్వర్ హుస్సేన్, శ్రీనివాస్ రెడ్డి, చంద్రశేఖర్, మాధవరెడ్డి, రాజేష్ కుమార్, నాగ నారాయణ హాజరు అయ్యారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- మండల వైద్యాధికారి డాక్టర్ స్పందన



నవతెలంగాణ-ఆత్మకూరు

సీజన్‌వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు మండల వైద్యాధికారి డాక్టర్ స్పందన తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో మండల ప్రజలు కలుషితమైన నీరు, ఆహారం తీసుకోవద్దని సూచించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు డలేరియా, డేంగు, మలేరియా, చికెన్ గున్యా, వంటి విష జ్వరాలు రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. నీటి నిల్వలు లేకుండా వారానికి ఒకసారి డ్రైడే ఫ్రైడే పాటించాలని కోరారు. తినే ఆహార పదార్థాల మీద, నీటి తొట్టెల పైన, కుళాయిలు మీద నిత్యం మూతలు ఉండేలా చూసుకోవాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఏఎన్ఎం లు ఆశా వర్కర్లు వారానికి ఒకసారి ఫ్రైడే డ్రైడే నిర్వహిస్తు ప్రజలకు అవగాహన కలిపిస్తున్నామని తెలిపారు. కాచి చల్లార్చిన నీరు, వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. బయటి ఆహార పదార్థాలను తినకూడదని సూచించారు. వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ నిత్యం చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు.

బేయర్ కంపెనీ మక్కల విత్తనాలతో తగ్గిన దిగుబడి

- డిస్ట్రిబ్యూటర్‌పై పోలీస్ స్టేషన్లో రైతుల ఫిర్యాదు

నవతెలంగాణ-శాయంపేట

బేయర్ కంపెనీ ఆడ, మగ మొక్కజొన్న విత్తనాలతో ఎకరాకు 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, 25 క్వింటాళ్ల కంటే దిగుబడి తక్కువగా వస్తే రూ.55వేల పరిహారం చెల్లిస్తానని రైతులను నమ్మించి విత్తనాలు అంటగట్టాడు. పంట సాగు చేసుకున్న రైతులకు ఎకరాకు 13 నుండి 15 క్వింటాళ్ల దిగుబడి రావడంతో, పరిహారం చెల్లించాలని అడిగితే డిస్ట్రిబ్యూటర్ మొహం చాటేయడంతో స్థానిక రైతులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాధిత రైతులు గుడాల ఆదిరెడ్డి, బత్తుల ప్రభాకర్, బోనపల్లి నరసింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సూరంపేటకు చెందిన రైతులకు కరీంనగర్ జిల్లా శంకర్ పట్నానికి చెందిన బేయర్ కంపెనీ డిస్ట్రిబ్యూటర్ తోట రాజు 2022 ఖరీఫ్‌సీజన్లో ఆడ,మగ మక్కజొన్న విత్తనాలను ఐదు కిలోల ప్యాకెట్లను ఉచితంగా అందించాడు. ఎకరాకు 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, కంకిని క్వింటాల్‌కు రూ.2150 చొప్పున కొనుగోలు చేస్తామని, ఎకరాకు 25 క్వింటాళ్లకంటే తక్కువ దిగుబడి వస్తే రూ.55 వేల నష్టపరిహారం చెల్లిస్తామని అగ్రిమెంటుఇచ్చాడు. కేవలం 13 నుండి 15 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే రావడంతో తాము నష్టపోయామని గుర్తించారు. వచ్చిన పంటను బేయర్ కంపెనీ ప్రతినిధులు కొనుగోలు చేసుకుని వెళ్లారని, నష్టపరిహారం అడగడానికి డిస్ట్రిబ్యూటర్‌కు ఫోన్ చేసిన స్పందించడం లేదని వాపోయారు. కరీంనగర్‌కు వెళ్లిన ఏమిచేయలేనని డిస్ట్రిబ్యూటర్ చేతులుఎత్తేసినట్లు తెలిపారు. ఇదే విషయాన్ని పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు.

విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తాం

- త్వరలోనే ఖాళీల భర్తీ.. ప్రమోషన్లు, బదిలీలు
- కార్మికులందరికి కనీస వేతనాలు
- టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి



నవతెలంగాణ-హసన్‌పర్తి

విద్యుత్ కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించి కార్మికులందరికి కనీస వేతనాలు అందేలా చేస్తామని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. టీజీ యూఈఈయూ-సీఐటీయూ రాష్ట్ర ఆందోళనలో భాగంగా తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ అనుబంద కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఎన్‌పీడీసీఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కె. ఈశ్వర్‌రావు, ఎన్‌పీడీసీఎల్ అధ్యక్షుడు జీ.అంజయనేయులు, కార్యదర్శి ఎం. ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వెంకటరాజు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నలవల స్వామి, కోలగానీ రమేష్, కంపెనీ కమిటీ సభ్యులు, వివిధ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మంగళవారం ఎన్‌పీడీసీఎల్ సీఎండీని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందజేసి మాట్లాడారు. ఎన్‌పీడీసీఎల్‌లో పనిచేస్తున్న ఆర్టిజన్లను పర్మినెంట్ ఉద్యోగులుగా కన్వర్షన్ చేయాలన్నారు. అన్‌మాన్డ్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలనీ, పీసురేటు కార్మికులైన బిల్ కలెక్టర్లు, మీటరు రీడర్లు, ఎస్‌పీఎం, స్టోర్, సెక్యూరిటీ గార్డు, అందరికీ కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. ఖాళీ పోస్టుల భర్తీ, ప్రమోషన్లు ఇవ్వలనీ, అందరికీ పెన్షన్ ఇవ్వాలనీ, 2011 జేఎల్‌ఎంలకు ఏరియర్స్ ఇవ్వలనీ, కంపెనీలో జేఎల్‌ఎం ప్రమోషన్లు, వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి వినతిపత్రాన్ని పరిశీలించి అన్ని డిమాండ్లను కులంకుషంగా చర్చించి డిమాండ్ల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

జేఎల్‌ఎంల ప్రమోషన్ తర్వాతనే ట్రాన్‌ఫర్‌లు ఉంటాయన్నారు. ఫీసు రేటు కార్మికులకు కనీస వేతనాల అమలు, మీటర్ రీడర్లు, బిల్ కలెక్టర్లకు ఉపాధిని కల్పించే ప్రతిపాదన తయారు చేస్తున్నట్లు తెలిపారు. అన్‌మాన్డ్ కార్మికులనకు కనీసవేతనాలు, ఆర్టిజన్‌గా గుర్తింపు ఇన్సూరెన్స్, ప్రమాదాలకు గురి అయినవారికి కాంపెన్సేషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. డిప్లమో పూర్తయి కంపెన్సేషన్ గ్రాండ్ కింద ఉద్యోగం పొందిన వారికి జూనియర్ అసిస్టెంట్ నుండి సబ్ ఇంజినీర్ కావడానికి తగు అవకాశం కల్పించనునట్టు తెలిపారు. సబ్‌స్టేషన్‌లలో రిటైరైన వారి స్థానంలో కొత్త వారిని తీసుకోనున్నట్లు తెలిపారు. బదిలీలు వచ్చే నెలలో ఉంటాయని ఇందుకు సంబంధించిన విధివిధానాలు తయారవుతున్నాయని 50 శాతం ఉంటాయని తెలిపారు. ఏపీటీఎస్ తొలగించిన వారిని తీసుకోవడం పరిశీలిస్తామన్నారు. ఓరల్‌గా అడిగిన అనేక సమస్యలను సీఎండీ వరుణ్‌రెడ్డి సమాధానాలు ఇచ్చారు. వ్యక్తిగత సమస్యలపై అందించిన దరఖాస్తులను పరిశీలించి న్యాయం చేయడం జరుగుతుందన్నారు. యూనియన్ ప్రొటెక్షన్ కంపెనీ అధ్యక్ష కార్యదర్శులు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులకు ఉండాలని కోరారు. భద్రత పరికరాలు అందిస్తామని తప్పనిసరిగా అవి ఉపయోగించాలని సీఎండీ సూచించారు.

కంపెనీ కమిటీ సమావేశం అనంతరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల టీజీ ఎన్‌పీడీసీఎల్ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. దీనిలో గౌరవాధ్యక్షులు జి.ప్రభాకర్ రెడ్డి, వరంగల్ అధ్యక్షులు పూర్ణాచారి, కార్యదర్శి ఎల్.శ్రీనివాస్, హనుమకొండ కార్యదర్శి వరుణ్ కుమార్, జనగామ కార్యదర్శి కుమారస్వామి, లక్ష్మణ్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు భాస్కర్, కార్యదర్శి కోటి, సురేందర్, భద్రాచలం, అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి వెంకటరాజు, కూసునూరి శ్రీనివాస్, కొత్తగూడెం కార్యదర్శి గణేష్, ఖమ్మం కార్యదర్శి కామినేని నాగేశ్వరరావు, జగిత్యాల, కరీంనగర్ జిల్లా నాయకులు, కమిటీ ఓబీ సభ్యులు సుదర్శన వర్మ తదితరులు పాల్గొన్నారు.

చింతగట్టు క్యాంపులో ఓ సీఐ కామక్రీడలు

- పోలీసు శాఖ ఆత్మగౌరవానికే గొడ్డలి పెట్టు
- ఆ సీఐ ప్రవర్తణపై పలు మహిళా సంఘాల ఆందోళన
- చట్టాన్ని అమలు చేసే శాఖకే తలవంపులు
- చీడ పురుగుల ఏరివేతకు చర్యలు శూన్యం



నవతెలంగాణ-హసన్‌పర్తి

కేయూ పోలీసు స్టేషన్ పరిధి చింతగట్టు క్యాంపులో ఓ పోలీసు ఉన్నతాధికారి కామక్రీడలపై సోషల్ మీడియాలో వైరల్ కావడం పలువురిని దిగ్భ్రాంతికి గురి చేసింది. బాధ్యతాయుతమైన విధులు నిర్వర్తించాల్సిన ఆ అధికారి ప్రవర్తణ పోలీసుశాఖ తలదించుకునేలా చేసింది. ఈ విషయంపై సీరియస్‌గా తీసుకోవాల్సిన ఆశాఖ ఉన్నతాధికారులే ఎమరుపాటుగా వ్యవహరించడం వల్లే ఇటువంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. గతంలో కూడా పోలీసు శాఖలో పనిచేస్తున్న మహిళా సీఐతో పాటు మరో సీఐ వ్యవహారం మరువకముందే మంగళవారం చింతగట్టు వ్యవహారం పోలీసుశాఖకే గొడ్డలిపెట్టుగా తయారైందన్న విమర్శలున్నాయి. వివరాల్లోకి వెళితే.. ఖమ్మం జిల్లాకు చెందిన ఎస్‌బీలో పనిచేస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్ గత కొంతకాలంగా వివాహేతర సంబంధం నడుపుతున్నట్లు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఆ సీఐ చింతగట్టు క్యాంపుసమీపంలోని ఔటర్‌రింగ్‌రోడ్డు సమీపంలోని ఓ గదిలో ఓ స్త్రీతోవివాహేతర సంబంధం నడుపుతున్నట్లు పక్కా సమాచారంతోనే టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని ఆ ఇన్‌స్పెక్టర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై సంబంధిత పోలీసుఇన్‌స్పెక్టర్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వివరాలను గోప్యంగా ఉంచడంతో ఈ వ్యవహారంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇప్పటికైనా సంబంధిత పోలీసు శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పోలీసు శాఖకు తలవంపులు తెచ్చే ఆశాఖ సిబ్బందిపై కఠినంగా వ్యవహరించి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని ప్రజా సంఘాల ప్రతినిధులు పోలీసు శాఖ ఉన్నతాధికారులను కోరుతున్నారు. ఈ విషయంపై వరంగల్ నగర పోలీసు కమిషనర్ ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే...

పైపులైన్ నిర్మాణ పనులకు మోక్షం

- 'నవతెలంగాణ' కథనంతో స్పందించిన అధికారులు



నవతెలంగాణ-హసన్‌పర్తి

టీఎస్ఆర్ఎస్‌లో నిలిచిన 'మిషన్ భగీరథ'... అసంపూరిగా పైపులైన్ నిర్మాణ పనులు అనే కథనంపై 'నవ తెలంగాణ' దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనానికి మిషన్ భగీరథ, కార్పొరేషన్ అధికారులు స్పందించారు. తెలంగాణ రాష్ట్ర బాలికల గురుకుల విద్యాలయం హసన్‌పర్తి ఆవరణలో అసంపూర్తిగా నిలిచిన పైపులైన్ పనులకు నెల రోజుల తరువాత మోక్షం లభించినట్లైంది. ఇరుశాఖల అధికారులు సమన్వయంతో మంగళవారం పనులు ప్రారంభమయ్యాయి. వివరాల్లోకి వెళితే... మండలంలోని ఎర్రగట్టుగుట్ట క్రాసురోడ్డు తెలంగాణ రాష్ట్ర బాలికల విద్యాలయం ఆవరణలోని మిషన్ భగీరథ పథకం కింద చేపట్టిన ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి పలు డివిజన్‌లకు కార్పొరేషన్ అధికారుల పర్యవేక్షణలో ప్రజలకు తాగునీటి సరఫరా అవుతుంది. ఈ క్రమంలోని జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ 1వ, 2వ, 66వ డివిజన్‌ల పరిధిలోని పలు కాలనీలకు సరఫరా చేస్తున్న తాగునీటి సరఫరా కావాల్సినంత అందకపోవడంతో గురుకులంలోని ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి పద్మశాలి కాలనీకి ప్రత్యేకంగా తాగునీటి సరఫరా పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టాలని కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. దీంతో సంబంధిత డీఈ 66వ డివిజన్ ఇంచార్జి ఏఈ దొడ్డపాటి హరికుమార్ గత నెల క్రితం పైపులైన్ నిర్మాణ పనులు ప్రారంభమై ఇప్పటి వరకు పూర్తి చేయలేదు. దీంతో జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలలు ప్రారంభం కావడంతో గురుకులానికి వచ్చే విద్యార్థులకు అసౌకర్యంగా మారింది. గురుకుల విద్యాలయం ఆవరణలో పైపులైన్ కోసంతీసిన గుంతలు విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉందని 'నవ తెలంగాణ' గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఇరుశాఖల అధికారులు స్పందించారు. మిషన్ భగీరథ ఈఈ రామాంజనేయులుతో పాటు మిషన్ భగీరథ పథకం పర్యవేక్షకులు తమ పరిధి కాదని ఈ పనులు కార్పొరేషన్ వారే చేయాల్సిఉందని చెప్పడంతో ఉన్నతాధికారులు యుద్ధప్రాతిపదికన కింది స్థాయి అధికారులను ఆదేశించారు. వెంటనే స్పందించిన డీఈ రవి కు మార్ పైపులైన్ పనులు పునరుద్దరించాలని ఏఈ హరికుమార్‌ను పురమాయించడంతో మంగళవారం పైపులైన్ పనులకు మోక్షం కలిగింది.హసన్‌పర్తి ప్రిన్సిపాల్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ ఇందుమతి 'నవతెలంగాణ'కు కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలలకు చేరిన నోట్‌బుక్స్, యూనిఫామ్

- ఇంకా అందాల్సిన పాఠ్యపుస్తకాలు
- 46 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో
- నేటికీ పూర్తి కాని పనులు
- సర్వీస్ పర్సన్స్ నియామకం ఎప్పుడో..?
- నేడు పాఠశాలలు పునఃప్రారంభం

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు ఇవ్వాల్సిన పాఠ్యపుస్తకాలు నేటికీ హన్మకొండ జిల్లాలో పూర్తిస్థాయిలో పాఠశాలలకు చేరుకోలేదు. యూనిఫామ్, నోట్ బుక్స్ మాత్రం అన్ని మండలాలకు చేరాయి. 89 శాతం పాఠ్యపుస్తకాలు మాత్రమే ఇప్పటి వరకు వచ్చినట్లు మరో 11 శాతం పాఠ్యపుస్తకాలు ఇంకా రావాల్సివుందని చెబుతున్నారు. ఇదిలావుంటే బుధవారం నుండి పాఠశాలలు పునఃప్రారంభం కానుండగా, మరోవైపు ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ నడుస్తుండడంతో ఈనెల 23 వరకు ఉపాధ్యాయులలో ఎక్కువ మంది బదిలీలు, పదోన్నతుల్లోనే నిమగ్నమై వుండే అవకాశముంది. అమ్మఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించాల్సిన మౌళిక వసతుల కల్పనకు ఇప్పటి వరకు మొదటి దశలో 270 పాఠశాలలను ఎంపిక చేయగా, ఇందులో 226 పాఠశాలలో వివిధ పనులను పూర్తి చేశారు. మరో 46 పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పన పనులు పూర్తి కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో సర్వీస్ పర్సన్స్‌ను నియమించాల్సిన అవసరముంది. అంతేకాకుండా పలు మండలాలకు ఎంఇఓల నియామకం జరుగలేదు. దీంతో విద్యాపాలనపై సరైన అజమాయిషి లేకుండాపోయింది. వెంటనే ఎంఇఓలను నియమించాల్సి వుంది.

హన్మకొండ జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థలకు చెందిన 516 పాఠశాలలకు సకాలంలో పాఠ్యపుస్తకాలు అందడంలో తీవ్రజాప్యం జరిగింది. ఇప్పటికీ 89 శాతం పాఠ్యపుస్తకాలు మాత్రమే మండల కేంద్రాలకు చేరాయి. మరో 11శాతం పుస్తకాలు చేరాల్సి వుంది. జిల్లాలో 32 వేల 244 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ఏకరూప దుస్తులు ఇప్పటికే ఆయా పాఠశాలలకు చేర్చారు. అదేవిధంగా 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు పంపిణీ చేయాల్సిన నోట్‌బుక్స్ ఇప్పటివరకు 2లక్షల 545 ఇప్పటికే మండలాలకు చేరాయి.

ఎంఇఓల నియామకం ఎప్పుడో..?

విద్యావ్యవస్థలో ఎంఇవోల పాత్ర కీలకం. ప్రతి మండలానికి ఒక ఎంఇఓ వుండాల్సివుండగా, ఎంఇఓల నియామకంలో తీవ్ర జాప్యం జరిగింది. ఒక్కో ఎంఇఓకు 4-5మండలాలు ఇన్‌ఛార్జిగా ఇవ్వడంతో విద్యా వ్యవస్థలో పాలన అస్తవ్యస్తంగా తయారైంది. పిజి హెచ్‌ఎంలనేఎంఇవోలుగా నియమిస్తుండడంతో అటు ఉన్నత పాఠశాల్లో పర్యవేక్షణసైతం దెబ్బతింటుంది. నూతన ప్రభుత్వం ఇప్పటికైనా ఎంఇవోలను శాశ్వత ప్రాతిపదికన నియమించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

పూర్తిస్థాయిలో అందని పాఠ్యపుస్తకాలు

హన్మకొండ జిల్లాలో పాఠశాలలు పునః ప్రారంభమవుతున్నా నేటికీ మరో11శాతం పాఠ్యపుస్తకాలు నేటికీ జిల్లాకేంద్రానికి చేరుకోక పోవడం గమనార్హం. ఇప్పటివరకు 89శాతం పాఠ్యపుస్తకాలు అందాయని చెబుతున్నారు.మొత్తం 2లక్షల 48వేల 254పాఠ్యపుస్తకాలు రాగా ఇప్పటికే మండల కేంద్రా లకు సరఫరా చేశారు.

46 పాఠశాలల్లో పూర్తి కాని పనులు

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా ఆయా పాఠశాలల్లో మౌళిక వసతులను కల్పించడానికి హన్మకొండ జిల్లాలో మొదటి దశలో 270 పాఠశాలలను ఎంపిక చేశారు. ఈపాఠశాలల్లో మరమ్మతులు, టాయిలెట్స్, పేయింటింగ్, విద్యుద్దీకరణ పనులు చేపడుతున్నారు. 226పాఠశాలల్లో మాత్రమే మౌళిక వసతుల కల్పన పనులను పూర్తి చేశారు. మరో 46పాఠశాలల్లో పనులు నేటికీ పూర్తి కాకపోగా బుధవారం నుండి పాఠశాలలు తెరుచుకోనున్నాయి. రూ.9.29కోట్ల అంచనాతో పనులు చేపట్టాలని భావించగా, ఇప్పటికే రూ.2.32 కోట్లను ముందస్తుగా విడుదల చేశారు. 226 పాఠశాలలు పేయింటింగ్ చేయడానికి సిద్ధంగా వున్నాయి.

సర్వీస్ పర్సన్స్ నియామకం ఎప్పుడో...?

ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో సర్వీస్ పర్సన్స్ పనిచేసేవారు. వారిని విధుల నుండి తొలగించారు. బుధవారం నుండి పాఠశాలలు పునఃప్రారంభం కానుండగా, సర్వీస్ పర్సన్స్‌ను నియమించక పోవడంతో పాఠశాలల్లో పారిశుధ్య పనులు చేయకపోతే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు తప్పవు. పాఠశాలలు పునఃప్రారంభానికి ముందే సర్వీస్ పర్సన్స్‌ను నియమించాల్సి ఉంది.

గర్భస్థ పిండ లింగనిర్ధారణ చేసే వారిపై కఠినచర్యలు

- వరంగల్ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



నవతెలంగాణ-వరంగల్

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మంది రంలో జిల్లా స్థాయి మల్టీమెంబర్ అప్రోపియట్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ జడ్జి బీవీ.నిర్మలా గీతాంబతో కలసి పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి స్కానింగ్ సెంటర్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీ చేసి ఫోటోలు కూడా తీయాలని, సంబంధిత ఫారంలు తప్పని సరిగా చెక్ చేయాలని, అనుమానం ఉన్న స్కానింగ్ సెంటర్లను గుర్తించి వాటిపై రహస్య ఆపరేషన్లు నిర్వహించి లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యుక్త వయసులో ఉన్న యువతకు గర్భస్థ లింగనిర్ధారణ నిషేధిత చట్టం గురించి అవగాహన క ల్పించాల న్నారు. యుక్త వయసులో వచ్చే మార్పులపై అన్నికళాశాలల్లో యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. భ్రూణ హత్యలను నివారించి, జిల్లాలో బాలికల నిష్పత్తి పెరిగేటట్లు చూడాలని కోరారు.ఈ సమావేశంలో డిసిపి రవి, డెప్యూటీ డీఎంహెచ్ఓ ప్రకాష్, ప్రాజెక్ట్ అధికారి పద్మశ్రీ, మాస్‌మీడియా అధికారి అనిల్, ఏసీపీ కిరణ్ కుమార్, ఇన్స్పెక్టర్ బాబురావు, అభ్యుదయ సేవా సమితి అధ్యక్షులు పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



నవతెలంగాణ-దామెర

మండలంలోని పసరుగొండ క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 163 జాతీయ రహదారిపై పసరుగొండ క్రాస్ వద్ద ఊరుగొండ గ్రామానికి చెందిన మన్నెం బుచ్చిరెడ్డి (64) తన ద్విచక్ర వాహనంపై వ్యవసాయ బావి వద్దకు వెళుతూ రోడ్డు దాటుతుండగా హనుమకొండ వైపు వెళ్తున్న లారీ వెనుక నుండి వేగంగా వచ్చి ఢీకొని అతనిపైనుండి వెళ్లడంతో తీవ్ర గాయాలై బుచ్చిరెడ్డి అక్కడికక్కడే మరణించాడు. మృతుని భార్య పద్మ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ ఇంద్రారెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొంకా అశోక్ తెలిపారు. కాగా ఊరుకొండ గ్రామానికి చెందిన మన్యం బుచ్చిరెడ్డి పార్థివదేహాన్ని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వరంగల్లోని ఎంజీఎం మార్చురీలో సందర్శించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

నేటి కాంగ్రెస్ సమావేశం విజయవంతం చేయండి

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



నవతెలంగాణ-ధర్మసాగర్

నేడు బుధవారం ఉదయం 10 గంటలకు మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్‌హాల్లో నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రులు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు, పాలకమండలి సభ్యులు, ముఖ్య నాయకులు లోక్‌సభ ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజ యం సాధించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యహాజరు కానున్నారని వివరించారు. ఈ సమావేశంలో పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎన్నికకు కృషి చేసిన నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేయడంతో పాటు నూతనంగా ఎన్నికైన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యను నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలకు పరిచయం చేయడం జరుగుతుందన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు,యువకులు, మహిళలు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరూ తప్పక హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆన్‌లైన్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించాలి

ఎన్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.వెంకటరమణ

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ హనుమకొండ సర్కిల్‌పరిధిలో ఆన్‌లైన్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపు రోజురోజుకు గణనీయంగా పెరుగుతుందని సూపరిండెంట్ ఇంజనీర్, కె. వెంకటరమణ తెలిపారు సాంకేతికతంగా ఎంతో అభివృద్ధి చెందుతున్న తరుణంలో అందుకు తగ్గట్టుగా వివిధ మాధ్యమాల ద్వారా ఆన్ లైన్ చెల్లింపులు సులభతరం చేసింది టీజీఎన్పీడీసీఎల్ ఇందులో భాగంగా మేనెలలో 1,25,668 గృహ వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా 22.17 కోట్లు మొత్తాన్ని చెల్లించారన్నారు ప్రతి నెల ఆన్ లైన్ ద్వారా చెల్లింపులు 20శాతం పెరు గుతుందన్నారు. టిజిఎన్పీ డీసీఎల్ మొబైల్ యాప్, వెబ్‌సైట్ : డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యూ.టీజీఎన్పీడీసీఎల్.కం , గూగుల్ పే, ఫోన్‌పే, పే టియం ద్వారా మీనెల వారి విద్యుత్ బిల్లులు చెల్లింపు చేయవచ్చు అన్నారు. కేవలం రెండు నిమిషాల వ్యవధిలో యుఎస్‌సి నెంబర్ ను నమోదు చేసి చిటికెలో విద్యుత్ వినియోగదారుడు బిల్లులు చెల్లింపు చేసుకోవచ్చు అన్నారు. కట్టిన డబ్బులు పూర్వ వివరాలు కూడా తెలుసుకోవచ్చు, రసీదు కూడా పొందటం జరుగుతుందని అన్నారు. ఇప్పుడు కొత్తగా బిల్లు పైనే క్యూఆర్ కోడ్‌ను ముద్రించడం జరుగుతుందని మొదట ప్రయోగాత్మకంగా (పైలట్ ప్రాజెక్ట్) గా వరంగల్ సర్కిల్ కేంద్రంలో మట్టెవాడ ఈఆర్ పరిధిలో లో ప్రారంభించడం జరిగింది త్వరలో హనుమకొండ సర్కిల్ లో కూడా ప్రారంభిస్తామని అన్నారు.100 శాతం సెల్ఫ్ రీడింగ్‌కు వినియోగదారులే తీసుకుంటూ బిల్లులు కూడా చెల్లిస్తున్నారని, వినియోగదారులకు కూడా 100 శాతం సెల్ఫ్‌రీడింగ్‌పై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు భవిష్యత్తు మొత్తం డిజిటల్ పెమెంట్స్ ద్వారా నే అన్ని కార్యకలాపాలు సాగుతుంటాయని అన్నారు.

నేటి నుంచి పాఠశాలల పునర్ ప్రారంభం

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

విద్యార్థులు బడికి వెళ్లాల్సిన సమయం ఆసన్నమైంది. గత ఏప్రిల్ 24 నుంచి పాఠశాలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా 2024 - 25 విద్యా సంవత్సరానికి గాను నేటి (బుధవారం) నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు బడికి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థులు వేసవి సెలవులను ముగించుకుని పాఠశాల బాట పట్టాల్సిన సమయం ఆసన్నమైంది. స్టేషన్ ఘనపూర్ మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత మొత్తంగా ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, ఆశ్రమ పాఠశాలలు 33 ఉన్నాయి. ప్రభుత్వం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), మోడల్ స్కూల్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ (ఎస్ డబ్ల్యూఆర్ఈఐ), ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ (టిడబ్ల్యూఆర్ఈఐ), మైనారిటీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ వంటి పాఠశాలలో విద్యార్థులకు విద్య నేర్పడంతో పాటు అక్కడే భోజన వసతి సౌకర్యాలతో విద్యాలయాలను ఏర్పాటు చేశారు. కాగా విద్యార్థులు నేటితో తరగతులకు హాజరుకానున్నారు.

ఏఈఓలపై సస్పెన్షన్ ఎత్తివేయాలి



నవతెలంగాణ - స్టేషన్‌ఘనపూర్

గ్రామాల్లో వ్యవసాయ మెలకువలు తెలిపే రైతులతో అనుసంధానమైన వ్యవసాయ విస్తరణ అధికారులను జీలుగ విత్తనాల పంపిణీలో భాగంగా, మహబూబాద్ జిల్లాలో ముగ్గురిని, ఆదిలాబాద్ జిల్లాలో ఒక ఏఈఓను అకారణంగా సస్పెండ్ చేయడం సరికాదని, వెంటనే సస్పెన్షన్‌ను ఎత్తివేయాలనిఉమ్మడి స్టేషన్‌ఘనపూర్ మండల పరిధి వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈఓ) కోరారు. మంగళవారం మండలంలోని చాగల్లు రైతు వేదిక ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరో చేసిన తప్పిదాన్ని ఏఈఓలపై చూపించి విధులనుంచి సస్పెన్షన్ చేయడం సరికాదన్నారు. సమగ్ర విచారణ జరిపించి దోషులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు నర్సింగ రావు, దీపక్, నర్సింహులు, అపూర్వ, అనిత, ప్రవళిక, కల్పన, రేష్మా, సౌజన్య అఖిల, సుష్మిత, వినయ్, రేవంత్, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.



సీఎంను కలిసిన 'కిరణ్‌కుమార్‌గౌడ్'

నవతెలంగాణ - జనగామ కలెక్టరేట్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మంగళవారం ఆయన నివాసంలో యువజన నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. చేర్యాల మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం గౌడ్ కుమారుడిగా, ఆయన రాజకీయ వారసుడిగా నియోజకవర్గంలోని ప్రజలకు కిరణ్‌కుమార్‌గౌడ్ నిత్యం అందుబాటులో ఉంటారనే పేరుంది. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికలకు ముందు వారి అనుచర వర్గంతో తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు.



జీపీ కార్మికులకు అన్నదానం

నవతెలంగాణ- స్టేషన్‌ఘనపూర్

ఎంపిటిసిల ఫోరం ప్రతినిధి, స్టేషన్ ఘనపూర్ -2 ఎంపీటీసీ గన్ను నర్సింహులు, కళావతి వివాహ వార్షికోత్సవ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో గ్రామ పంచాయితీ కార్మికులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా గన్ను నర్సింహులు మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రతలో జీపీ కార్మికుల సేవలు మరువలేనివని అన్నారు. ఈకార్యక్రమంలో గన్ను కళావతి నర్సింహులు, ఉమా శంకర్, కొత్తపెల్లి దిలీప్, లావణ్య, ఈఓ సత్యం, పంచాయితీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



వైస్ ఎంపీపీ ఆర్థికసాయం

నవతెలంగాణ - స్టేషన్‌ఘనపూర్

మండలంలోని తాటికొండ గ్రామంలో దొమ్మాట బుచ్చమ్మ మృతిచెందింది. మంగళవారం బాధిత కుటుంబాన్ని వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బొంగోని యాదగిరి, పొన్నం శ్రీనివాస్ , మూసిని స్వామి, పొన్నం రఘు, బూరుగు మల్లయ్య, కుసుమ రమేష్, అక్కనపల్లి వెంకటయ్య, సత్తయ్య, బైరగోని లక్ష్మణ్, దొమ్మాట మహేష్, బొంగోని సుధీర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి మల్లారెడ్డి పరామర్శ

నవతెలంగాణ -లింగాల ఘనపురం

మండలం చీటూరు గ్రామానికి చెందిన మల్యాపురం బాలమల్లయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం విషయం తెలుసుకున్న లింగాల గణపురం కాంటెస్టెడ్ జెడ్పీటీసీ పోరెడ్డి మల్లారెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

హిందీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-లింగాలఘనపురం

మండల కేంద్రంలోని మాడల్ స్కూల్‌లో హిందీ భాష భోధించేందుకు పోస్ట్ ఖాళీ ఉన్నదని, తాత్కాలిక ప్రాతిపదికన పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ పుష్పకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ తోపాటు హిందీ పండింట్ ట్రైనింగ్ చేసి, అనుభవం ఉన్న వారు ఈనెల15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9676959203లో సంప్రదించాలని సూచించారు.

'పరిశీలించే వరకు వెళ్లొద్దు'

నవతెలంగాణ-బచ్చన్నపేట

బచ్చన్నపేట మండలంలోని చినరామచర్ల గ్రామ శివారులోని గంధమల్ల లక్ష్మయ్య పేరిట సర్వేనెంబర్ 340, 342లో ఉన్న 5 ఎకరాల 16 గుంటల భూమిలోకి ఎవరూ వెళ్లొద్దని, తాసిల్దార్ విశాలాక్షి విచారన చేసే వరకు వెళ్లొద్దని బాధితురాలు గంధమల్ల విమలమ్మ తెలిపారు. మంగళవారం స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాసిల్దార్ కార్యాలయానికి తహసీల్దార్ పిలిపించి 15 రోజులలో మోక ఎంక్వయిరీ చేసి వచ్చిన ఫిర్యా దును పరిశీలిస్తామని హామీనిచ్చినట్లు తెలిపారు. అప్పటివరకు ఎవరు కూడా ఆ భూమిలోకి వెళ్ళకూడదని చెప్పారన్నారు. నిబంధనలు బేఖాతర్ చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పినట్టు వివరించారు.

నేటి నుంచి మోగనున్న బడిగంట



- సమస్యల వలయంలో సర్కారు బడులు
- మూతపడిన పాఠశాలలకు మోక్షం కలిగేనా ?
- పూర్తికాని అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు
- పడకేసిన 'మన ఊరు-మన బడి'
- నిరుపయోగంగా తొర్రూరు ఉన్నత పాఠశాల గదులు
- 70 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు







నవతెలంగాణ-పాలకుర్తి

ప్రభుత్వ పాఠశాలలో సమస్యలతో స్వాగతం పలుకుతూ నేటి నుండి బడి గంట మోగనుది. పాలకుర్తి మండలంలో 74 ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలతో పాటు గురుకులాలు ఉండగా అందులో బాలికల గురుకుల పాఠశాలలు మూడు, ఉన్నత పాఠశాలలు 12, ప్రాథమికోన్నత పాఠశాలలో 4, ప్రాథమిక పాఠశాలలు 55 ఉన్నాయి. 74 పాఠశాలల్లో 2023 డిసెంబర్ నాటికి 10 పాఠశాలల్లో విద్యార్థులు లేక, 6 పాఠశాలలకు ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు లేక మొత్తం 16 పాఠశాలలు మూతపడ్డాయి. 2023 డిసెంబర్ 7న రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో మూతపడిన పాఠశాలలన్నింటిని తెరిపించాలని దృఢ సంకల్పంతో విద్యాశాఖకు ఆదేశాలు జారీ చేసింది. కాగా, నేటి నుండి పాఠశాలల పునర్ ప్రారంభంలో మూతపడిన బడులకు మోక్షం కలుగుతుందా అని మూతబడిన పాఠశాలల గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు.

మరోవైపు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి సహకారంతో పాలకుర్తి మండలంలో 30 అమ్మ ఆదర్శ పాఠశాలలు ఎంపిక కాగా పనులు తుదిదశకు చేరుకున్నాయి. తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణాలతో పాటు విద్యుత్ సౌకర్యం, పాఠశాలల మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన మన ఊరు మనబడి కార్యక్రమంలో పాలకుర్తి మండలానికి 22 పాఠశాలలు ఎంపిక చేయగా 2 పాఠశాలల పనులను మాత్రమే పూర్తయ్యాయి. మిగతా పాఠశాలల్లో పనులు సాగకపోవడంతో పడకేసాయి. మండలవ్యాప్తంగా 71 ప్రభుత్వ ఉన్నత ప్రాథమికోన్నత ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు 300మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా 230మంది మాత్రమే ఉన్నారు. 70 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండడంతో నాణ్యమైన విద్య అందడం లేదనే విమర్శలు ఉన్నాయి. తొర్రూరు జే ఉన్నత పాఠశాలకు పక్కా భవనం ఉన్నప్పటికీ విద్యార్థులకు ఆ భవనంలో విద్య అందకపోవడంతో నిరుపయోగంగా ఉంది. ఖాళీల్లో 10 ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టులు, 12 ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులు, 22 మంది ఉపాధ్యాయులు, పండిట్, స్కూల్ అసిస్టెంట్ ఇతరులు 26 పోస్టులు ఖాళీగా ఉన్నాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు. మొత్తం మండలంలో 74 పాఠశాలల్లో 2875 మంది విద్యార్థులు ఉన్నారని విద్యాశాఖ నోడల్ అధికారి పోతుగంటి నరసయ్య తెలిపారు. విద్యార్థులందరికీ ఒక జత ఏకరూప దుస్తులు అందించామని తెలిపారు. 25 వేల ఐదు వందల మందికి పాఠ్యపుస్తకాలు 14000 నోట్ పుస్తకాలు అందించామని తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ పాఠశాలల్లోనే అనుభవమైన ఉపాధ్యా యులతో నాణ్యమైన విద్య అందుతుందని, గ్రామీణ పట్టణ ప్రాంత విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యా య పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. పాలకుర్తి మండలంలో 30 అమ్మ ఆదర్శ పాఠశాలలను ఎంపిక చేశాం. మరమ్మతు పనులతో పాటు మౌలిక సదుపాయాలు పూర్తయ్యాయి. ప్రైవేటుకు దీటుగా అమ్మ ఆదర్శ పాఠశాలలను తీర్చి దిద్దుతున్నాం. విద్యా ర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దుస్తుల తోపాటు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందిస్తాం. మూతబడిన పాఠశాలలను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించాం. పాల కుర్తి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలన్నింటినీ ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా తీర్చి దిద్దుతాం.

-పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, పాలకుర్తి

పనులు నాణ్యతతో చేపట్టాలి : ఎమ్మెల్యే కడియం



నవతెలంగాణ - జనగామ కలెక్టరేట్

రహదారుల పనులు నాణ్యతతో చేపట్టాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. మంగళవారం సమీకృత జిల్లా అధికారుల భవన సముదాయం సమావేశ మందిరంలో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ సమీక్ష సమావేశం జరిగింది. పంచాయతీరాజ్, ఏటూరునాగారం ఐటీడీఏ, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో చేపడుతున్న రహదారుల పనుల పట్ల సమీక్షించి ఎమ్మెల్యే మాట్లాడారు. విద్య, వైద్య పనులకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలన్నారు. విడుదల చేసిన నిధులను సకాలంలో వినియోగించి పాఠశాలల్లో అదనపు వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా ఉపయోగకర రహదారులను మొదట చేపట్టాలన్నారు. చేపట్టిన పనులు డిసెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 89 పనులకు గాను 29 మాత్రమే పెండింగ్ ఉన్నాయని, ట్రైబల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో 33 పనులు ఉండగా 9 మాత్రమే పూర్తయ్యాయని, మిగిలిన పనులను త్వరితగతిన చేపట్టాలన్నారు. జనగామ, స్టేషన్‌ఘన్పూర్ నియోజకవర్గాలలో బంజార భవన్ నిర్మాణాల కోసం స్థలం మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. పేదలకు వైద్య సేవలు మరింత అందుబాటులోకి తీసుకురావాలన్నారు. డివిజన్ స్థాయిలో కార్యాలయాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ పంచాయతీరాజ్‌శాఖ ఎస్ఈ కె రఘువీరారెడ్డి, ఏటూర్‌నాగారం ఐటీడీఏ ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ డి వీరభద్రం, పంచాయతీరాజ్‌శాఖ ఈఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సదుపాయాలను విద్యార్థులు వినియోగించుకోవాలి

జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్



నవతెలంగాణ- స్టేషన్‌ఘనపూర్

ప్రభుత్వ బడులల్లో విద్యార్థులకు అందించే ఉచిత సదుపాయల్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఈ విద్యా సంవత్సరంకు సంబంధించిన ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం, నోట్ పుస్తకాలు, తదితర సదుపాయాలు కల్పిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి ఫీజులు, డొనేషన్లు ఉండవని అలాగే నిష్టాతులైన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన ఉంటుందని అన్నారు. తల్లితండ్రులు వారి పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి అభివద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ నోడల్ అధికారి కొమురయ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రవికుమార్, శారోన్, ప్రమోద్ రెడ్డి, అశోక్ కుమార్, నీల కంఠం, ఎమ్మార్సి సిబ్బంది గిరి, లవన్,ప్రవీణ్, వెంకటేశ్వర్లు,జ్యోతి,శ్రీలత,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'సాంబరాజు రవి'కి ఘన నివాళి



నవతెలంగాణ-జఫర్‌గడ్

తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి మాజీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాంబరాజు రవి ప్రథమ వర్ధంతి మంగళవారం జఫర్‌గుడ్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. సమితి జిల్లా అధ్యక్షులు ఏదునూరి నరేష్ అధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. భౌతికంగా వారు మా మధ్యన లేకున్నా రజక జాతికి చేసిన సేవలు చిరస్మరణీయం అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ అశోక్, సూరారం మాజీ సర్పంచ్ మేడిపల్లి శ్రీనివాస్, చిట్యాల ఐలమ్మ మనుమలు చిట్యాల రామచంద్రం, సంపత్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి సోమన్న, నేషనల్ ధోబీ రిజర్వేషన్ సంఘ్ జాతీయ ఉపాధ్యక్షులు ఉల్లెంగల యాదగిరి, తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక, రాష్ట్ర ఉపాధ్యక్షులు సాంబరాజు కుమార్, మిన్నలపురం జలేందర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఏదునూరి వీరన్న, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దీకొండ రాజు, కళామండలి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యామంకి యుగేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉల్లెంగుల యాదగిరి, మాజీ సర్పంచ్, జిల్లా సీనియర్ నాయకులు ఉల్లెంగుల రాములు, జిల్లా గౌరవ అధ్యక్షులు రాపర్తి యాకన్న,జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిపాక రాములు, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా మిషన్ భగీరథ సర్వే...

ఎంపీడీఓ ఉమాదేవి



నవతెలంగాణ - స్టేషన్‌ఘనపూర్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ సర్వే అత్యంత పారదర్శకంగా ఉండాలని ఎంపీడీఓ ఉమాదేవి సూచించారు. మండలంలో మిషన్ భగీరథకు సంబంధించి ఇంటింటి నల్లా కనెక్షన్‌ల సర్వే ప్రక్రియ మంగళవారం ముమ్మరంగా కొనసాగింది. సర్వే పది రోజుల్లో పూర్తి కావాలనే ఉద్దేశంతో పంచాయతీ కార్యదర్శిలు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు నమోదు ప్రక్రియ వేగవంతం చేశారు. నల్లా కనెక్షన్లు కలిగిన నివాసాలు, ఇంకా ఇవ్వాల్సిన కనెక్షన్లు, ఇతర వివరాలతో కూడిన సమాచారాన్ని, ఇంటింటికీ వెళ్లి యజమానితో పాటు కుటుంబ సభ్యులు, ఆధార్ నంబర్లు, ఫోన్ నంబర్లు, ఇతర వివరాలు, నీటి సరఫరాకు సంబంధించి ఫొటోలను యాప్‌లో పొందుపర్చారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి జేసుమణి, ఫీల్డ్ అసిస్టెంట్ అమీనా, కారోబార్ రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.



20న 'జాతీయ నులి పురుగుల నిర్మూళన'

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషాషేక్

నవతెలంగాణ - జనగామ కలెక్టరేట్

ఈ నెల 20న మొదటి దశ జాతీయ నులి పురుగుల నిర్మూళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషాషేక్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా అధికారులతో టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని కళాశాలలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో 1-19ఏండ్లలోపు పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు అందజేస్తారని అన్నారు. చేతుల పరిశుభ్రతపై విద్యార్థులు, చిన్నారులకు పోస్టర్‌ల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. జిల్లావ్యాప్తంగా 16 పీహెచ్‌సీలలో ఓపీ సేవలు పెంచాలన్నారు. రోస్టర్ ప్రకారం డాక్టర్లు, సిబ్బంది విధులు నిర్వహించకుంటే చర్యలు తప్పవన్నారు. పెండింగ్ లో ఉన్న ఆస్పత్రులు, ల్యాబ్‌ల అప్‌గ్రేడేషన్ పూర్తిచేసి నివేదికలు సమర్పించాలన్నారు. అనంతరం సంబంధిత అవగాహన పోస్టర్లు ఆవిష్కరించారు. డీఎంహెచ్ఓ హరీష్ రాజ్, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఈఓ రాము, డీఐఈఓ ఆంజనేయరాజు, డీడబ్ల్యూఓ జయంతి, డీఐఓ డా. మహేందర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. సుధీర్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ అశోక్ కుమార్, డాక్టర్ కర్ణాకర్ రాజు, డీఈఎంఓ ప్రభాకర్, సీహెచ్ఓ జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగానే బక్రీద్

రాబోయే బక్రీద్‌ను నిబంధనలకనుగునంగానే నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డీసీపీ సీతారాం, ఏసీపీ అంకిత్ కుమార్ శంఖ్వార్‌తో కలిసి వెటర్నరీ డిపార్ట్మెంట్ అధికారులు, ముస్లిం పెద్దలతో సమావేశమయ్యారు. జంతు వధ నిషేధమని అన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే నోటీస్ జారీ చేయకుండానే అరెస్టు చేస్తారని, రూ.1000 జరిమానా గానీ, 3 నెలల జైలు శిక్ష గాని విధిస్తారని అన్నారు. కన్వీనర్ డాక్టర్ ఎస్ఎల్ మనోహర్, డివిహెచ్ఓ డాక్టర్ వై. నరసయ్య, జిల్లాలోని పశు వైద్యులు, ముస్లిం పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

లక్కీడ్రా ద్వారా విద్యార్థుల ఎంపిక

షెడ్యూల్డ్ కులాల అభివద్ధిశాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద విద్యార్థుల ఎంపిక లక్కీ డ్రా ద్వారా చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ సమక్షంలో లక్కీ డ్రా ద్వారా ఒకటో తరగతిలో 34మంది, 5వ తరగతిలో 25మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించారు. ఈ పథకం ద్వారా విద్యార్థులు లబ్ధి పొంది భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. షెడ్యూల్డ్ కులాల అభివద్ధి శాఖ జిల్లా అధికారికి దయానందరాణి, విద్యాశాఖ అధికారి రాము, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జిల్లా కోఆర్డినేటర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

టీజీవీఎన్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తాళ్లపల్లి నరేష్

నవతెలంగాణ-జఫర్‌గడ్

తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ (టీజీవీఎన్-జేఏసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా తాళ్లపల్లి నరేష్‌ను నియమించినట్లు జేఏసీ రాష్ట్ర చైర్మెన్ కోటూరి మానవతారాయ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. జఫర్‌గడ్ మండలం షాపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి నరేష్ 2016 విద్యార్థి నిరుద్యోగ జేఏసీ పాదయాత్రలో కీలక భూమిక పోషించి, విద్యార్థి నిరుద్యోగ సమస్యలపై ఉద్యమిస్తూ, వాటి పరిష్కారం కోసం అనునిత్యం కషి చేస్తున్న తాళ్లపల్లి నరేష్ గౌడ్‌ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నరేష్‌గౌడ్ మాట్లాడుతూ తన నియమకానికి సహకరించిన రాష్ట్ర చైర్మన్ కోటూరి మానవతారాయ్, రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ మేడారపు సుధాకర్, పట్ట నాగరాజు, హేమంత్ చౌదరి, దుర్గం వినోద్‌కు కతజ్ఞతలు తెలిపారు.

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న పాలకులు

తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు బలాష్టి రమేష్

నవతెలంగాణ-మహబూబాబాద్



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు బలాసి రమేష్ విమర్శించారు. అంబేద్కర్ యువజన సంఘం అమనగల్ కార్యకర్తల సమావేశము స్థానిక అంబేద్కర్ భవన్లో యువజన సంఘ కోశాధికారి ఆర్ .ప్రవీణ్ అధ్యక్షతన సంఘ కార్యకర్తల సమావేశంలో రమేష్ మాట్లాడుతూ గ్రామాలలోనున్న యువజన సంఘం బాధ్యులు ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. పాలకవర్గ పార్టీలు పేదలపై చిన్నచూపు చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని అభివద్ధి పథంలో నడిపిస్తూ అందరికీ విద్యను అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వంశీ గంగరాజు వరుణ్ 50 మంది సభ్యులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి

ఎఫ్ఎంఎంఎస్ఎస్ కో-ఆర్డినేటర్ నిరుడు శిరీష

నవ తెలంగాణ -మరిపెడ



మానవ అక్రమ రవాణాను నిర్మూలించాల ఎఫ్ ఎం ఎం ఎస్ ఎస్ మండల కోఆర్డినేటర్ నిరుడు శిరీష అన్నారు. మంగళవారం మండలంలోని వీరారం గ్రామంలో మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో శిరీష మాట్లాడుతూ బాల్యవివాహాలను అరికట్టాలని, చిన్నపిల్లల కిడ్నాప్లను గుర్తించి ప్రభుత్వానికి సమాచారం ఇవ్వాలని ఆమె వారికి సూచించారు. మహిళలు వివిధ సందర్భాలలో ప్రమాదాల్లో ఉన్నప్పుడు హెల్ప్ లైన్ కోసం 100,1098,181,1930 నెంబర్లకు డయల్ చేయాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ ఏ శ్రీవాణి, ఆయమ్మ నాగలక్ష్మి, సుగుణ, దేవి సుగుణ, ఏకమ్మ ,శిరీష శైలజ, నాగమణి ,నరసమ్మ, భవాని, వెంకట నర్సమ్మ ఉన్నారు.



సర్వే ఆధారంగా బీసీజీ టీకా

నవతెలంగాణ-మహబూబాబాద్

జిల్లాలో ఇచ్చే అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ టీకాను సర్వే ఆధారంగా ఇవ్వనున్నట్లు డీఎంఅండ్‌హెచ్‌ఓ కళావతిబాయ్ తెలిపారు. అడల్ట్ బి సి జి వ్యాక్సిన్ టీక పై రెండవ రోజు శిక్షణా కార్యక్రమం మంగళవారం స్థానిక ఐఎంఏ హాల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసార్ కి,హెల్త్ సూపర్వైజర్స్, టీబి ప్రోగ్రాంలో పని చేస్తున్న ఎస్టిఎస్‌కు, ల్యాబ్ టెక్నీషియన్స్‌కి వయోజన బీసీజీ వ్యాక్సిన్ పై శిక్షణ ఇచ్చారు ఆమె మాట్లాడుతూ జిల్లాలో 18 సంవత్సరాల పైబడిన వారందరికీ బీసీజీ టీకా అందించేందుకు ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి కళావతి భాయి పేర్కొన్నారు. అదేవిధంగా డాక్టర్ అంబరీష్ , డిప్యూటీ డిఎంహెచ్ఓ, ప్రోగ్రాం ఆఫీసర్ ఇమ్మైజేషన్ మాట్లాడుతూ, ఎవరైతే అనారోగ్య కారణాలు ఉన్న, టీబి పేషెంట్స్ కు, గర్భిణీ స్త్రీలకు, పాలిచ్చే తల్లులకు, పోషకాహార లోపం ఉన్న వారికి, 18 సంవత్సరాల కన్న తక్కువ వయస్సు ఉన్నవారికి,గత మూడు నెలల్లో రక్తమార్పిడి చరిత్ర గలన వ్యక్తులకు, హెచ్ఐవి సంక్రమణ సోకే అవకాశం ఎక్కువగా ఉన్న వ్యక్తులకు ఈ వ్యాక్సిన్ ఇవ్వకూడదని పేర్కొనడం జరిగింది. ఎలాంటి అపోహలు పడవద్దని కోరారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరెవరికి ఇవ్వాలనేది సర్వే ఆధారంగా గుర్తించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎమ్ఎచ్ఓ డాక్టర్ అంబరీష్, డాక్టర్ మురళీధర్, డాక్టర్ విజయ్ కుమార్ ,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ క్రిష్టార్జునరావు, కెవి రాజు , గీతా హెల్త్ ఎడ్యుకేటర్స్ , వడ్డే బోయిన శ్రీనివాస్,రామకష్ణ పాల్గొన్నారు

మున్సిపల్ అధికారుల అవినీతిపై సీఎంకు ఫిర్యాదు

మలిదశ ఉద్యమకారుడు అహ్మద్ ఖాన్

నవతెలంగాణ-మహబూబాబాద్



పట్టణంలో మునిసిపల్ అధికారులు ప్రభుత్వ భూములలో, చెరువు శిఖం భూములలో, ప్రైవేట్ వ్యక్తుల భూముల్లో అక్రమంగా గృహ నిర్మాణ అనుమతులు ఇస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని మలిదశ ఉద్యమకారుడు అహ్మద్ ఖాన్ విమర్శించారు ఈ మేరకు అహ్మద్ ఖాన్ హైదరాబాదులో సోమవారం ప్రజాపాలన భవన్లో గ్రీవెన్స్ లో సీఎం రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఆయన కథను ప్రకారం తెలంగాణ ఉద్యమకారుడు అయినా తన స్థలం ఆక్రమించి బీఆర్ఎస్ పార్టీ నాయకుడు మున్సిపాలిటీ అనుమతి లేకుండా ఇంటిని నిర్మిస్తుండగా తాను కమిషనర్ కు జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు.మహబూబాద్ పట్టణంలోని గుముడూరు ఏరియాలో నర్సంపేట రోడ్డులో తనకు వంశపారంపర్యంగా సర్వే నెంబర్ 287 లో వంశపారంపరంగా వచ్చిన ఇంటి స్థలం ఉందని అన్నారు ఈ సర్వే నెంబర్ భూములలో గతంలో మూడు నాలుగు సార్లు నిర్మించిన నిర్మాణాలకు ప్రభుత్వ అధికారుల ద్వారా కూల్చడం కూడాజరిగినది అన్నారు మా భూమిలో దాదాపు 3 నెలలుగా బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఒక వ్యక్తి మున్సిపాలిలో ఇంటి నిర్మాణానికి ఎలాంటి అనుమతి లేకుండా, అదికూడా ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం చేపడుతూ ఉంట అతనికి సహకరిస్తున్నారు అన్నారు. మహబూబాద్ కమిషనర్ పై విచారణకు పై అధికారులను ఆదేశించాలని,"చెరువు శిఖం, ప్రభుత్వ భూములలో" జరుగుతున్న నిర్మాణాలపై, కమీషనర్ ను బాధ్యుడిని చేస్తూ, కమిషనర్ పై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి, మున్సిపల్ అధికారులపై కఠిన చర్య తీసుకోవాలన్నారు తన భూమిలో కబ్జా చేసి అక్రమంగా బబీఆర్ఎస్ నాయకుడు నిర్మిస్తున్న ఇంటిని నిలుపు వేసి తన భూమి తనకి ఇప్పించాలని కోరారు.

విత్తన కుంభకోణంపై జ్యుడీషియల్ విచారణ జరిపించండి

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపందా) జిల్లా సహాయ కార్యదర్శి రవి

నవతెలంగాణ-తొర్రూరు



వర్షాకాలం రైతాంగానికి అవసరమగు జిలుగ, పచ్చిరొట్ట తదితర విత్తనాల కుంభకోణంలో తొర్రూర్ వ్యవసాయ అధికారులు పరస్పర విరుద్ధ ప్రకటనల నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డి జోక్యం చేసుకోని జ్యుడీషియల్ విచారణ జరిపించాలని సిపిఐ (ఎంఎల్)మాస్ లైన్ (ప్రజా పందా) జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. మంగళవారం తోరూర్ లోని పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు 1600 బస్తాలు బోగస్ పేర్లతో ఇతర రాష్ట్రాలలో అమ్ముకునే వ్యవసాయ శాఖ అధికారులు తప్పు నాది కాదంటే నాది కాదంటూ పరస్పర విరుద్ధ ప్రకటనలు చేయడం సరికాదు అన్నారు. ఇంత పెద్ద కుంభకోణం విషయంలో రైతుల, ప్రజల ప్రయోజనాల దష్ట్యా స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకొని సమగ్ర జ్యుడిషియల్ విచారణకు ఆదేశించాలని రవి కోరారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాకుండా కిందిస్థాయి అధికారులను పంపించి మొక్కుబడి విచారణ జరిపించడం వల్ల జరిగిన అవినీతి, అక్రమ కుంభకోణ బయటికి రావటం లేదని అన్నారు. సొంత శాఖ అధికారులు జరిపే విచారణలో పారదర్శకత లోపిస్తుందని గతంలో అనేక అనుభవాలు ఉన్నాయని అన్నారు. సమగ్ర విచారణకు జ్యుడీషియల్ ఎంక్వైరీ కమిటీ వేసి, విచారణ చేసి, దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. లేదంటే ఐక్యంగా ఆందోళన కార్యక్రమాన్ని ఉదతం చేస్తామని చెప్పారు.ఎన్నికల కోడ్ ముగిసిన దష్ట్యా స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు అపరికతంగా ఉన్నాయని, వాటి పైన దష్టి సారించి పరిష్కారానికి తగు ప్రణాళికను రూపొందించాలని కోరారు. అనంతరం సిపిఐ(ఎంఎల్)మాస్ లైన్ ప్రజాపంద తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న మాట్లాడుతూ డివిజన్ కేంద్రమైన తొరూరు పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాల తరలింపు, ఎస్ టి ఓ కార్యాలయం ఏర్పాటు, ఫైర్ స్టేషన్ మంజూరు, పెద్ద చెరువు ట్యాంకబడ్ గా మార్చే ప్రణాళిక తదితర సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు బండపల్లి వెంకటేశ్వర్లు, పల్లెల పాపారావు, ఇరుగు అనిల్, చింతా నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు శిఖ భూముల ఆక్రమణలను నియంత్రించాలి

నవతెలంగాణ-గార్ల

మండలంలోని సీతంపేట సమీపంలోని గార్ల పెద్ద చెరువులో గత కొంత కాలంగా కబ్జాకు గురౌతున్న చెరువు శిఖం భూములను కాపాడాలని సీతంపేట ఎంపిటీసి గుండెబోయిన నాగమణి కోరారు. పెద్ద చెరువులో కబ్జాకు గురౌతున్న శిఖం భూములను కాపాడాలని మంగళవారం తహశీల్దారు రవీందర్ కు అందించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ పెద్ద చెరువు భూములను కొందరు వ్యక్తులు కబ్జా చేస్తూ చెరువును పుడ్చుతున్నారని సుమారు గా 150 ఎకరాల భూమిని కబ్జాకు గురైందని అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి గుగులోత్ దేవా,నాయకులు అజ్మీర సుమలత,పూనెం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు పోదాం పదండి

- నేటి నుండి పాఠశాలలు ప్రారంభం
- పూర్తి కానీ మన ఊరు మనబడి పనులు
- 225 మూత 70 లో నీటి కొరత
- బదిలీలు పదోన్నతుల లో ఉపాధ్యాయులు
- మొక్కుబడిగా కొనసాగుతున్న బడిబాట

నవతెలంగాణ-మహబూబాబాద్

అరకొర సౌకర్యాలు అనేక సమస్యల మధ్య పాఠశాలలు ప్రారంభం కానున్నాయి ఒకవైపు మండుతున్న ఎండలు మరోవైపు ఉపాధ్యాయుల ఖాళీలు ఇంకొక వైపు పూర్తి కానీ అభివద్ధి పనులతో నూతన విద్యారంగం ప్రారంభం కానుంది రాష్ట్రంలో దశాబ్ద టిఆర్ఎస్ పాలన ముగిసి కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా విద్యారంగం ప్రారంభం కానుంది ఎప్పటిలాగే ప్రభుత్వ పాఠశాల కు పోవడానికి విద్యార్థులు అనాసక్తి చూపుతున్నార . తల్లితండ్రులు ససేమిరా అంటున్నారు తాము పస్తులు ఉండైనా కాయ కష్టం చేసిన తమ పిల్లను ఇంగ్లీష్ మీడియం సిబిఎస్సి హాస్టల్ లో చేర్పించి కార్పొరేట్ విద్యా అందించాలని ఉరుకులు పరుగులు పెడుతున్నారు ఏటేటా మహబూబాబాద్ జిల్లాలో ప్రభుత్వ విద్యా రంగంలో విద్యార్థుల సంఖ్య పడిపోతుంది తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రాకముందు జిల్లాలో ప్రభుత్వ విద్యా రంగంలో 1,20,000 మంది విద్యార్థులు ఉండగా నేడు ఆ సంఖ్య సగానికి పడిపోయింది ప్రభుత్వ విద్యారంగంలో బాలబాలికలకు యూనిఫామ్ పోషకాహారం వారానికి మూడు గుడ్లు ఉచిత పుస్తకాలు ఉచిత నోట్ పుస్తకాలు ఎస్సీ ఎస్టీలకు రవాణా భత్యం బాలికలకు ఫ్రీ బస్సు బాలులకు రాయితీ బస్సు పాస్తులు క్రీడా మైదానాలు పరీక్ష ప్రయోగశాలలో ఆట వస్తువులు ఏర్పాటు చేసినప్పటికీ ప్రభుత్వ విద్యారంగంపై సమాజంలో అనాసక్తి నెలకొంది జిల్లాలో గత ప్రభుత్వం 320 ప్రభుత్వ పాఠశాలను మన ఊరు మనబడి కార్యక్రమంలో ఎంపిక చేశారు ఈ పథకంలో భాగంగా ఆ పాఠశాలలో త్రాగునీరు మరుగుదొడ్లు వంటశాలలో సౌకర్యాలు కల్పించాల్సి ఉంది కానీ ఈ పనులు ఇంకా కొనసాగుతున్నాయి పూర్తి కాలేదు అని సమాచారం మరోపక్క కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల పథకాన్ని తీసుకుని వచ్చింది ఈ పథకం పనులు ఇప్పుడిప్పుడే కొనసాగుతున్నాయి

225 పాఠశాలలు మూత

మానుకోట జిల్లాలో గత ఏడాది వరకు 225 పాఠశాలలో జీరో విద్యార్థుల సంఖ్య ఉండంగా మూత పడ్డాయి మూతపడిన పాఠశాలల్లో మహబూబాబాద్ మండలంలో 18 మరిపెడలో 32 నరసింహులపేటలో 6 తోరూర్ లో నాలుగు పెద్ద వంగరలో ఐదు చిన్న గూడూరు లో ఏడూ నెల్లికుదురులో 7 ఇనుగుర్తిలో 8 గార్లలో 8 గూడూరులో 13 కొరవీ లో 8 కొత్తగూడలో 5 గంగారంలో 4 దంతాలపల్లి లో 5 డోర్నకల్లు 9 కేసముద్రంలో ఏడు సిరోలు లో నాలుగు బయ్యారంలో ఐదు పాఠశాలలు మూతపడి ఉన్నాయి రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఈ పాఠశాలను తెరిపించడం కోసం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు

జిల్లాలో 968 పాఠశాలలో 70,202 విద్యార్థులు

విద్యాశాఖ డైస్ లెక్కల ప్రకారం జిల్లాలో ప్రభుత్వ రంగంలో 968 పాఠశాలల్లో 70,202 మంది విద్యార్థులు ఉన్నారు పిఎస్ యుపిఎస్ జడ్పీహెచ్ఎస్ కలిపి ప్రభుత్వ రంగంలో 898 తోపాటు వివిధ సొసైటీలు గురుకులాలు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు కేంద్రీయ విద్యాలయాలు కలిపి 968 ప్రభుత్వ పాఠశాలల్లో 70,202 మంది విద్యార్థులు ఉన్నారు ఇందులో ప్రభుత్వ పాఠశాలలైన 898లో పిఎస్ యుపిఎస్ జడ్పిహెచ్ఎస్ లో 45622 మంది, 8 మోడల్ స్కూల్లో 5134 మంది 15 కేజీబీవీ లలో 3175 మంది 5 సాంఘిక సంక్షేమ సొసైటీలు గురుకులాల్లో కలిపి 2764 మంది ఐటీడీఏ పరిధిలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో 6454 మంది గిరిజన సంక్షేమ శాఖ సంక్షేమ శాఖ సొసైటీ పరిధిలోని 7 గురుకులాలలో 2,919 మంది బీసీ సంక్షేమ శాఖలోని ఐదు జ్యోతి బా పూలే గురుకులాలలో 2259 మంది మూడు మైనార్టీ గురుకుల పాఠశాలలో ఒక 1051 మంది ఐదు ఏకలవ్య గురుకుల పాఠశాలలో 565 మంది కేంద్రీయ విద్యాలయంలో 264 మంది డోర్నకల్ లోని ఒక ఎయిడెడ్ పాఠశాలలో 94 మంది విద్యార్థులు ఉన్నట్లు డైస్ రిజిస్టర్ చెబుతుంది

104 ప్రైవేట్ లో 26 456 మంది విద్యార్థులు

జిల్లాలో ఇంగ్లీష్ మీడియం సీబీఎస్సీ కార్పొరేట్ ప్రైవేటు పాఠశాలలు 104 ఉండగా అందులో 26,456 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు మొత్తం ప్రభుత్వ ప్రైవేటు విద్యా రంగంలో కలిపి 96,752 మంది విద్యార్థులు జిల్లాలో ఉన్నట్లు డైస్ నివేదికలు చెబుతున్నాయి

దుమ్ము దులిపి చెత్తాచెదారం ఎత్తి

మహబూబాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలను శుభ్రం చేసి దుమ్ము దులిపి చెత్తాచెదారం తొలగించి ఉన్నంతలో శుభ్రం చేయడానికి గ్రామపంచాయతీలో మున్సిపల్ సిబ్బంది ప్రయత్నం చేస్తున్నారు మన ఊరు మనబడి కార్యక్రమంలో జిల్లాలో 320 పాఠశాల ఎంపిక చేయగా చాలా పాఠశాలలో ఇంకా పనులు పూర్తి కాలేదు మరోవైపు అమ్మ ఆదర్శ పాఠశాల ప్రక్రియ కొనసాగుతుంది

70 పాఠశాలలో నీటి కొరత

జిల్లాలో 70 ప్రభుత్వం పాఠశాలలో త్రాగునీరు అందడం లేదు మీ మిషన్ భగీరథ కులాలు అన్ని పాఠశాలకు ఇవ్వడం లేదు కనెక్షన్ ఉన్నప్పటికీ రోజు విడిచి రోజు రెండు మూడు రోజుల ఒకసారి నీరు రావడంతో విద్యార్థులకు త్రాగునీరు అందడం లేదు మధ్యాహ్న భోజనానికి నీటి కోసం విద్యార్థులు ఇంటి వద్ద నుంచి వాటర్ క్యాన్లు తీసుకొని పోతున్నారు మధ్యాహ్నం భోజనం గంటలకు బోరింగ్ నుంచి సిస్టర్ నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నారు



ఎస్ఎస్సి లో 12వ స్థానం 381 ఖాళీలు

విద్యారంగంలో మహబూబాబాద్ జిల్లా ఎస్ఎస్సి ఫలితాలలో 12వ స్థానంలో ఉంది మానుకోట జిల్లా ఏర్పడిన తొలి నాలో మహబూబా జిల్లా ఎస్ఎస్సి లో 31 స్థానంలో చివరగా ఉండగా కథ ఏడాది 2024 నాటికి 12వ స్థానానికి వచ్చింది గత ఏడాది జిల్లాలో 544 మంది 10వ తరగతి విద్యార్థులు ఫెయిల్ అయ్యారు ఉత్తీర్ణత శాతం 94.62 గా ఉంది జిల్లాలో ప్రస్తుతం 4378 ఉపాధ్యాయ పోస్టులు ఉండగా అందులో 381 ఖాళీలు ఉన్నాయి ఇందులో 263 ఎస్జీటీ టీచర్ పోస్టులు ఖాళీగా ఉండగా మిగిలినవి స్కూల్ అసిస్టెంట్ పీఈటీలు భాష పండిట్లో 118 పోస్టులు ఖాళీగా ఉన్నాయి ప్రభుత్వం ఉపాధ్యాయ రంగంలో పదోన్నతులకు బదిలీలకు నోటిఫికేషన్ జారీ చేసింది జిల్లాలో విద్యాశాఖ ఆధ్వర్యంలో పదోన్నతుల సీనియార్టీ జాబితాను ఖాళీలను ప్రకటించే పనిలో విద్యాశాఖ నిమగ్నమై ఉంది విద్యార్థుల సంఖ్య ప్రభుత్వ విద్యా రంగంలో పెంచడం కోసం ప్రభుత్వం ఆరో తేదీ నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా ఉపాధ్యాయులు బదిలీలు పదోన్నతులప నిమగ్నమై మొక్కుబడిగా బడిబాట నిర్వహిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది కాగా ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభించిన తొలిరోజే యూనిఫాం పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని ప్రభుత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి : యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ మల్లారెడ్డి

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి సౌకర్యాలు మెరుగుపరచాలి పాఠశాలలో ఉపాధ్యాయుల ఖాళీలు భర్తీ చేసి అహల్లాదకరమైన వాతావరణం కల్పించాలి గ్రామీణ పాఠశాలకు కూడలిగా విద్య రంగాన్ని బలోపేతం చేయాలి విద్యారంగానికి బడ్జెట్లో నిధులు పెంచాలి పాఠశాలలో పూర్తిస్థాయిలో త్రాగునీరు మరుగుదొడ్లు వంట గదిలో క్రీడా సామాగ్రి ప్రయోగశాల గ్రంథాలయం ఏర్పాటు చేయాలి.

బడి గంటలు మోగే వేళ..!

- ముస్తాబవుతున్న పాఠశాలలు, తరగతి గదులు
- వెక్కిరిస్తున్న టీచర్ల ఖాళీలు, కనీస సౌకర్యాలు కరువు
- నేటికీ పూర్తికాని అమ్మ ఆదర్శ పనులు

నవతెలంగాణ-తొర్రూరు

వేసవి సెలవులు పూర్తి అయ్యాయి.. మళ్లీ బడికి వేలవుతుంది.. ఓవైపు ప్రైవేటు పాఠశాలలు సకల సౌకర్యాలతో విద్యార్థుల తల్లిదండ్రులను రారమ్మని స్వాగతం పలుకుతున్నాయి. మరోవైపు పలు సర్కారు బడులు ఇంకా సౌకర్యాల లేమి తోనే విద్యార్థులను ఆహ్వానిస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాలతో బుధవారం నుంచి 2024- 25 విద్యా సంవత్సరం బడి గంటలు మోగనున్నాయి. విద్యార్థుల ఉరుకులు పరుగులు... కేరింతలు... మొదలవనున్నాయి. ఇప్పటికే ప్రైవేటు, కార్పోరేట్ కళాశాలలు అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేయగా సర్కార్బడులు మాత్రం అలంకరణలకు ఆదేశాల క్రమంలోనే ఉన్నాయి. మరోవైపు కార్పొరేట్ పాఠశాలలు లక్షల ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాశాఖ మాత్రం ఏమీ అనకుండా ఉందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

నేటి నుంచి బడి షురూ..

బుధవారం నుంచి నూతన విద్యా సంవత్సరం 2024- 25 ఆరంభం కానుంది. ప్రతి ఉదయం విద్యార్థులు ఒకపక్క, వారి తల్లిదండ్రులు మరోపక్క పరుగులు పెట్టనున్నారు. అటెన్షన్ ప్లీజ్.... సైలెన్స్ ప్లీజ్ అంటూ టీచర్ల పని ప్రారంభం కానుంది. ఇక విద్యార్థులకు స్వాగతం పలికేందుకు ఇటు సర్కారు అటు కార్పొరేటు పాఠశాలలు ముస్తాబవుతున్నాయి. ఈ మేరకు ఇప్పటికే సర్కారు బడుల్లో తరగతి గదులను అందంగా అలంకరించాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేయగా... కార్పొరేట్ విద్యాసంస్థలు అలంకరణలు అడ్మిషన్లు వంటి ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేశాయి.

వెక్కిరిస్తున్న ఖాళీలు...

మండలంలోని సర్కారు బడుల్లో ఉపాధ్యాయుల ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. దీర్ఘకాలంగా ఉద్యోగ విరమణలతో ఖాళీ అయిన పోస్టులు భర్తీ కావడం లేదు. మండలంలో 17 ఉపాధ్యాయ పోస్టులు చాలాకాలంగా ఖాళీగా ఉన్నాయి. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు నిపుణుల పోస్టుల భర్తీ అంతత మాత్రమే ఉందని దీంతో విద్యార్థుల చదువులు భారంగా మారుతున్నాయి అనేది తల్లిదండ్రుల వాదన. ఇక ప్రైవేటు విద్యాసంస్థల్లో తక్కువ వేతనాలతో పని చేసే టీచర్ల నైపుణ్యం అంతంత మాత్రంగా తయారయింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలు, ప్రైవేటులో టీచర్ల నైపుణ్యత లేమి మొత్తంగా ఈ ఏడాది విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్రంగా ప్రభావం చూపనున్నాయి.



నత్త నడకన అమ్మ ఆదర్శ పనులు...

ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అమ్మ ఆదర్శ పనులు అంతంత మాత్రమే నత్తనడకన సాగుతున్నాయి. కనీస మౌలిక వసతుల కల్పనకు చేపట్టిన పనులు సగం కూడా పూర్తికాలేదు.

నిబంధనలకు విరుద్ధంగా..

కొన్ని ప్రైవేటు స్కూల్స్ నిబంధనలకు విరుద్ధంగా స్టేషనరీ వ్యాపారాలు కొనసాగిస్తున్నాయి. సంబంధిత విద్య శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రైవేటు పాఠశాలలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపణలు ఉన్నాయి. స్కూలు ప్రాంగణాల్లో పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫామ్, బెల్ట్, డైరీ, షుఊస్ ఇలా విద్యార్థులకు కావాల్సిన సకల సరంజామాను బాహాటంగా విక్రయిస్తున్నాయి. కొన్ని స్కూల్స్ అయితే విద్యాసంస్థ పేరుతో ఎమ్మార్పీ ధరలను ముద్రించుకొని విద్యార్థులకు అంటగడుతున్నాయి. ఇతర షాపుల్లో కొనుగోలు చేసిన నోటు పుస్తకాలను అనుమతించబోమని స్పష్టం చేయడంతో విధిలేని పరిస్థితుల్లో అక్కడే కొనుగోలు చేయాల్సి వస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

కేసముద్రం స్టేషన్‌లో హైస్కూల్ బడిబాట

నవతెలంగాణ కేసముద్రం రూరల్

ప్రొఫెసర్ జయశంకర్ బాడిబాటలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కేసముద్రం స్టేషన్ అమీనాపురం గ్రామంలో పుర విధుల్లో తిరుగుతూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించండి అంటూ ఇంటింటికి తిరిగి ప్రచారం చేయడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులలో అన్ని రంగాలలో ప్రతిభ ఉంటుందని మనఊరు బడి అయిన మన ప్రభుత్వ బడిలో చేర్పించి వారి సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేయాలని ప్రధానోపాధ్యాయులు బి. రాజు తల్లిదండ్రులను కోరారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, కష్ణవేణి, మధు, యాదగిరి, మదన్మోహన్, శ్రీనివాసులు, సదయ్య, సురేష్, చందర్, భద్రాసింగ్, లక్ష్మి కుమారి, శ్రీవిద్య, సత్యనారాయణ, జుబేర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలి

నవతెలంగాణ-గార్ల

విద్యార్థులు చదువులతో పాటు క్రీడలలో రాణించాలని ఎస్ఐ ఎస్.జీనత్ కుమార్, మాజీ ఫిజికల్ డైరెక్టర్ రామన్న లు అన్నారు. స్థానిక బాస్కెట్ బాల్ గ్రౌండ్‌లో నిర్వహించిన బాస్కెట్ బాల్ సమ్మర్ కోచింగ్ ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాస్కెట్ బాల్ క్రీడలో మెలకువలు నేర్చుకొని మండల స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు విద్యార్థులు ఎదగాలని గార్ల మండలానికి కన్న తల్లిదండ్రులు కోచ్ లకు పేరు ప్రఖ్యాతలు తీసుకొని రావాలని సూచించారుమండలంలో అంతరించిపోతున్న బాస్కెట్ బాల్ క్రీడకు పునర్ వైభవం తేవడానికి ఎంతో మందికి రామన్న శిష్యులు ఆర్థిక సహాయం చేయడం వలన ఈనాడు బాస్కెట్ బాల్ కోర్టును ఏర్పాటు చేసుకొని దాదాపు 40 మంది విద్యార్థిని విద్యార్థులకు సమ్మర్ కోచింగ్ ఇవ్వడం జరిగిందని చెప్పారు.



అనంతరం సమ్మర్ కోచింగ్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు సర్టిఫికేట్ లతోపాటు మెమొంటో లను అందించారు. ఈ కార్యక్రమంలో జాతీయ స్థాయి అథ్లెటిక్ గోల్డ్ మెడల్ సాధించిన సాంబమూర్తి, మండల బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు తోడేటి రాము, కత్తుల ప్రశాంత్, బూర్ల చంద్రశేఖర్, రెడ్డి మల్ల ఉమేష్ , శేఖర్, ఆశిష్ జైన్,అలవాల పవన్,రిజ్వాన్,సిద్దు, మేఘన్, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఘటన పోరాట నేత రాధక్కకు విప్లవ జోహార్లు

నవతెలంగాణ-బయ్యారం



గోదావరిలో ప్రతిఘటన పోరాట నిర్మాత భారత విప్లవోద్యమ అగ్రనేత చంద్ర పుల్లారెడ్డి జీవిత సహచరిగా గోదావరి లోయ పరివాహక ప్రాంతంలో ప్రతిఘటన పోరాటాన్ని నిర్మించడంలో తనదైన పాత్రను పోషించిన రాదక్క అలియాస్ నిర్మలక్క క్యాన్సర్ బారిన పడి మంగళవారం హైదరాబాదులో మరణించారని, ఆమెకు సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ విప్లవ జోహార్లు అర్పిస్తున్నదని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. రాధక్కకు నివాళులర్పిస్తూ బయ్యారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సంతాప కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ..భారత విప్లవోద్యమ చరిత్రలో ప్రతిఘటనా పోరాటానికి ఎంతో ప్రాధాన్యత వున్నదని, మంథని మహదేవ్ పూర్ నుండి శ్రీకాకుళం వరకు గోదావరిలోయ పరీవాహక ప్రాంతంలో ఉవ్వెత్తున సాగిన ప్రతిఘటన పోరాటంలో రాధక్క ప్రత్యక్షంగా పాల్గొని నాయకత్వం వహించిందన్నారు. ఆదివాసీ, గిరిజనుల కోసం గోదావరి లోయలో అసమాన త్యాగాలతో సాగిన ఉద్యమానికి పుల్లారెడ్డితో కలిసి నాయకత్వం వహించిన రాధక్క చివరి శ్వాస వరకు ప్రతిఘటన పోరాట రాజకీయాలతోనే కొనసాగిందన్నారు. ఆమె మరణం విప్లవోద్యమానికి తీరని లోటని, ఆమె నడిచిన ప్రతిఘటన పోరాట బాటే భారత ప్రజల విముక్తి బాటని, ఆ మార్గంలో పయనించటమే రాధక్కకు అర్పించే ఘన నివాళని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ రామగిరి బిక్షం, ప్రగతి శీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఊకె పద్మ, పార్టీ మైదాన మండల కార్యదర్శి మాధంశెట్టి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు కొదుమూరి నాగేశ్వరరావు, జెరిపోతుల బుచ్చయ్య, కోనూరి యుగేందర్, నిడికొండ మహేశ్, ఎనుగుల మురళీ, బీరెడ్డి సంగయ్య వీరబోయిన ఐలయ్య, రెడ్డిమల్ల విశ్వనాథం, ఊకె శేషు తదితరులు పాల్గొన్నారు.

కట్ చేసిన డబ్బులను కార్మికులకే ఇవ్వాలి

నవతెలంగాణ కేసముద్రం రూరల్

కేసముద్రం మండలం వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ముందు వ్యాపారస్తులు వే బ్రిడ్జిల ద్వారా కొనుగోలు చేసిన సరుకులకు రైతుల వద్ద నుండి కార్మికుల పేరుతో కటింగ్ చేసిన రూపాయలను కార్మికులకే ఇవ్వాలి.మార్కెట్ రేట్లు పెంపుదల విషయంలో డిఎమ్ఓ అగ్రిమెంట్ చేయవలసి ఉండగా నెలల తరబడి పెండింగ్ పెట్టడం ఏమిటని హమాలీలు దడవాయిలు ధర్నా చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐసిటియు జిల్లా అధ్యక్షులుకంచ వెంకన్న మార్కెట్ కార్యదర్శి దష్టికి తీసుకువెళ్లి కాలయాపన గనక చేసుకుంటూ పోతే పరిశ్రమలుబీవ్యవసాయ మార్కెట్ ను బంద్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హమాలీల నుండి వేల్పుల వెంకన్న సముద్రాల మల్లయ్య గుగులోతు లక్ష్మణ్ సాంబయ్య ఎస్కే పాషా ఉప్పలయ్య దడవాయిల నుండి సంఘం అధ్యక్షులు ఆంగోత్ మంగీలాల్ కంది వెంకన్న శ్రీనివాసు పాల్గొన్నారు.

విత్తన కుంభకోణంపై విచారణ జరిపించండి

జెడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్

నవతెలంగాణ-తొర్రూరు

మండల కేంద్రంలోని మూడు ఆగ్రో సెంటర్లు, పిఎసిఎస్ కేంద్రంలో జరిగిన జీలుగా విత్తనాల బ్లాక్ మార్కెటింగ్ పై సమగ్ర విజిలెన్స్ విచారణ జరిపించాలని మంగళ వారం జిల్లా కలెక్టరు పంపిన వినతి పత్రంలో జెడ్పి ఫ్లోర్ లీడర్, జడ్పిటిసి మంగళపల్లి శ్రీనివాస్ కోరారు. మండలానికి 600 జీలుగుగా విత్తన బస్తాలు రాగా అధికారులు దళారులతో కుమ్మక్కై ప్రభుత్వం అందించిన సబ్సిడీ బస్తాలను అధిక ధరలకు బ్లాక్ మార్కెట్లో విక్రయించుకున్నారని ఆ ప్రకటనలో తెలిపారు.

జిల్లాలో ధరణి పోర్టల్ లో పెండింగ్లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని జెడ్పి ఫ్లోర్ లీడర్, జడ్పిటిసి మంగళపల్లి శ్రీనివాస్ మంగళవారం జిల్లా కలెక్టర్కు పంపిన వినతి పత్రంలో కోరారు. ప్రస్తుతానికి సమస్యలు పెండింగ్లో ఉండడంతో వానాకాలం సాగు చేయడానికి రుణాలు పొందలేక, సబ్సిడీలు తీసుకోలేక, ధాన్యం క్రయ, విక్రయాలు చేసుకోలేక, చిన్న చిన్న సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కావున జిల్లా కలెక్టర్ పరిధిలో వివిధ కేటగిరీల్లో పెండింగ్లో ఉన్న భూ ధరణి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆ వినతిపత్రంలో కోరారు.

నవతెలంగాణ 5
సమగ్ర తెలుగు దినపత్రిక
జయశంకర్
ములుగు - భూపాలపల్లి
బుధవారం | జూన్ 12, 2024 | www.navatelangana.com

ఎంటెక్ విద్యార్థిని సంకే పల్లవికి ఆర్థికసాయం

నవతెలంగాణ -తాడ్వాయి

ఎంటెక్ ఇన్ టెక్నాలజీ అండ్ డెవలప్మెంట్, గేట్ ఓవరాల్ ర్యాంక్ 104 సాధించి సీటు పొందిన మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన సంకె పల్లవిని కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎర్రబెల్లి మనోజ్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మేడారంలో వనదేవతల సన్నిధిలో శాల్వాలతో సత్కరించి రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టపడి చదివి ముంబై ఎంటెక్ ఇన్ టెక్నాలజీ అండ్ డెవలప్మెంట్, గేట్‌లో సీటు సాధించిన పల్లవికి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు యువకులు పల్లవిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కష్టపడి ఉన్నత చదువులకు వెళ్లే పేద విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా నాయకులు బాదం ప్రవీణ్, ఎర్రబెల్లి రాజేశ్వర్, బిక్షపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బొల్లు దేవేందర్, మేడారం ట్రస్ట్ బోర్డు మాజీ అధ్యక్షులు అర్రెమ్ లంచ్ పటేల్, పిఎసిఎస్ చైర్మన్ పులి సంపత్ గౌడ్, మండల గౌరవ అధ్యక్షులు జాలపు అనంతరెడ్డి, నాయకులు మడకం శోభన్,



సమ్మయ్య, గంపల శివ, గజ్జల నారాయణ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



తునికాకు బోనస్ డబ్బులు చెల్లించాలి

భారీ ర్యాలీ, ఫారెస్ట్ కార్యాలయం ముట్టడి

నవతెలంగాణ-గోవిందరావుపేట

తునికాకు కూలీలకు బోనస్ వెంటనే చెల్లించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి గొంది రాజేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పొదిళ్ల చిట్టిబాబు డిమాండ్ చేశారు. మంగళ వారం పస్రా అటవీ క్షేత్ర కార్యాలయాన్ని సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో సీపీఐ(ఎం) కార్యాలయం నుండి ఫారెస్ట్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అటవీ క్షేత్ర కార్యాలయాన్ని ముట్ట డించారు. అనంతరం అటవీ క్షేత్ర కార్యాలయ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు, రాజేష్ మాట్లాడుతూ ములుగు జిల్లాలో తునికాకు సేకరణ కూలీలకు 2016 నుండి 2023 వరకు బోనస్ డబ్బులు ఇవ్వలేదని అన్నారు. రూ.600 కోట్లు బ్యాంక్‌లలో ఉన్నాయని, అధికారుల నిర్లక్ష్యంతో పంపిణీ చేయట్లేదని అన్నారు. గతంలో కూలీలకు ఇచ్చిన బోనస్ పంపిణీలో అవకతవకలు జరిగాయని విమర్శించారు. ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఏటా తునికాకు సేకరణ కూలీల లిస్టు బహిరంగపర్చాలని, అర్హులకు బోనస్ వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. లేదంటే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు అంబాల మురళి ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు దుగ్గి చిరంజీవి, అల్లం అశోక్ కొట్టే కృష్ణారావు, సీఐటీయూ జిల్లా నాయకులు ఉపేంద్ర చారి, బ్రహ్మాచారి మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కారం రజిత, సువర్ణ, అచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

మంగపేట : తునికాకు కూలీలకు పెండింగ్ బోనస్ డబ్బులను చెల్లించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి జాగటి చిన్న డిమాండ్ చేశాడు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన తునికాకు కూలీలు మంగళవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఫారెస్ట్ అధికారులకు వినతిపత్రం అందశారు. ఈ సందర్భంగా చిన్నా మాట్లాడారు. సీసీఎఫ్ నుండి నిధులు విడుదలై సంవత్సరం కావస్తున్న కూలీలకు డబ్బులు అందకపోవడం విడ్డూరమన్నారు. ఈ విషయమై స్థానిక ఫారెస్ట్ రేంజ్ అధికారి షకీల్ పాషాను వివరణ కోరగా తునికాకు కల్లాల నిర్వాహకులు సేకరించి ఇచ్చిన కూలీల బ్యాంక్ ఖాతాలలో బోనస్ డబ్బులు ఇదివరకే జమ చేసినట్టు చెప్పారని అన్నారు. కానీ, తునికాకు కూలీలకు డబ్బులు ఇవ్వలేదని, ఇప్పటికైనా బోనస్ చెల్లించకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు ప్రసాద్ పాల్గొన్నారు.

కబ్జా భూమిని కాపాడాలని ఆందోళన



నవతెలంగాణ-గణపురం

మండలంలోని ధర్మారావుపేట గ్రామ ఊర చెరువు శిఖం దాదాపు 30 ఎకరాల భూమి కబ్జాగురైందని గ్రామస్తులు ఆయకట్టు రైతులు మంగళవారం ఆందోళన చేపట్టారు. 20ఏండ్లుగా అధికారులకు ప్రభుత్వ పాలకులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. చెరువు భూమిని సింగరేణి వారికి వ్యవసాయభూమిగా రికార్డ్ లోకి ఎక్కిస్తూ కబ్జాదారులు డబ్బులు తీసుకునేందుకు సింగరేణి అధికారుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఊర చెరువు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. రెవెన్యూ, ఐబీ అధికారులు చెరువుకు హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. త్వరలో సింగరేణిలో చెరువు శిఖం పోయే అవకాశం ఉన్నదని, ఇందులో డబ్బులు సమకూర్చుకునేందుకు ఇప్పటినుండే ప్రయత్నాలు చేస్తున్నారన్నారన్నారు. వారి ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుద్ఘాతంతో దుక్కిటెద్దు మత్యువాత

నవతెలంగాణ-మల్హర్‌రావు

ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతంతో మండలంలోని కిషన్ రావుపల్లి గ్రామంలో రైతు బియ్యని రామయ్యకు చెందిన రూ.60 వేల విలువైన దుక్కిటెద్దు మృత్యువాతపడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎద్దు యజమాని, గ్రామస్తుల కథనం ప్రకారం... ఎద్దును మేతకోసం విడిచిపెట్టగా గ్రామ సమీప పొలాల్లోకి వెళ్లింది. అక్కడే కంచె లేకుండా ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రధాన విద్యుత్ తీకు తగిలి ఎద్దు అక్కడికక్కడే మృత్యువాత పడింది. ఖరీఫ్ వ్యవసాయ పనుల ప్రారభం నేపధ్యంలో దుక్కులు దున్నడానికి సన్నద్ధమవుతుండగా ఎద్దు మృతి చెందడంతో బాధిత రైతు కన్నీరుమున్నీరయ్యాడు. ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు తమను ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకుంటోంది.

సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన...

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ - ములుగు

వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపితో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ములుగు జిల్లా రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ చంద్రతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ... ప్రతి జిల్లాలో రెండు రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ హాళ్లను ప్రారంభించామని, ప్రతి మంగళవారం రైతు వేదికలో రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలతో రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేస్తున్నామని అన్నారు. వెరైటీ పంటల సాగు చేసే రైతులతో, స్థానిక ఆదర్శ రైతులతో వారి అనుభవాలను ఇతర రైతులకు తెలియజేసే కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. సేంద్రియ ఎరువుల వినియోగం వైపు దష్టి పెట్టాలన్నారు. అధిక దిగుబడినిచ్చే పంటలకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విత్తనాల విషయంలో రైతులకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. రైతులు పండించే పంటలు ప్రపంచ దేశాలను ఆకర్షించే విధంగా ఉండాలని, కాలానుగుణంగా పంట మార్పిడి చేయాలని అన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్

వ్యవసాయ రంగానికి సాంకేతికతను అనుసంధానం చేస్తూ రైతు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలనే ఉద్దేశంతో చేపట్టిన రైతు నేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి మాట్లాడిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ



దిగుబడి పొందేలా రైతులు నూతన విధానాలను అలవర్చుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ఏవో సంతోష్ , వ్యవసాయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

- ప్రభుత్వ పాఠశాలలకు నూతన హంగులు
- విత్తనాలు ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు
- సన్న వడ్లు పండించేలా చర్యలు చేపట్టాలి
- జిల్లా సాధారణ సర్వసభ్య సమావేశం లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



నవతెలంగాణ-భూపాలపల్లి

అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి జిల్లా అభివద్ధిలో భాగస్వాములు కావాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళ వారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో జెడ్పీ వైస్ చైర్మెన్ కల్లెపు శోభ అధ్యక్షతన నిర్వహించిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని పలు శాఖల అంశాలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు నూతన హంగులు ఏర్పడ్డాయని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మహిళా స్వయం సంఘాల ద్వారా ఏకరూప దుస్తులు కుట్టించి అందిస్తున్నామన్నారు. పాఠశాలల పనులను అధికారులు పర్యవేక్షిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నేడు పాఠశాలల పునర్ ప్రారంభం దృష్ట్యా ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని, పాఠశాలను సందర్శించి పండుగ వాతావరణంలో విద్యార్థులకు స్వాగతం పలకాలని తెలిపారు. మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయ ఖాళీల వివరాల నివేదిక అందించాలని అన్నారు. జిల్లా పరిధిలోని మోడల్ స్కూల్‌లలో, ఇతర ప్రభుత్వ గురుకులాలలో నిరుపేద విద్యార్థులు చదువుకోవడానికి సీట్ల సర్దుబాటును జిల్లా కలెక్టర్ ద్వారానే కేటాయించేలా ఉత్తర్వులు తెస్తామని అన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా 2లక్షల43 వేల ఎకరాల్లో పంట సాగు జరుగుతుందన్నారు. ఎరువులు, యూరియా అందుబాటులో ఉంచుకోవాలని, విత్తనాలకు కొరత లేకుండా చూడాలని అన్నారు. ఇప్పటికే వ్యవసాయ శాఖ కమిషనర్ తో మాట్లాడి 3వేల పత్తి గింజల ప్యాకెట్లు జిల్లాకు కేటాయించామని కోరా మన్నారు. రైతులు సన్న వడ్లు పండించేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు రూ.500 బోనస్ ప్రకటించార న్నారు. తై బందీకి ఏర్పాట్లు చేయాలని, ముందస్తుగా వరి నాట్లు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మిన, విత్తనాలను అధిక ధరకు విక్రయించినా, కత్రిమ విత్తనాల కొరత సష్టించిన పీడీ యాక్ట్ నమోదు చేస్తా మన్నారు. వడ్ల కొనుగోలు కేంద్రాలలో క్వింటాలకు 4 కిలోలు తరుగు తీస్తూ దోపిడీ చేస్తున్న రైస్ మిల్లర్ పై చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో అలసత్వం వహిస్తున్న సివిల్ సప్లై డీఎంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సంవత్సరం వర్షాకాలంలో భూపాలపల్లి జిల్లాలో తెగిపోయిన 129 చెరువుల మరమ్మత్తు పనులు చేపట్టగా 56 చెరువుల పనులు పూర్తి అయ్యాయని, 64 చెరువుల పనులు పురోగతిలో ఉన్నాయని, 26 చెరువులకు టెండర్లు ఫైనల్ చేసినట్టు తెలిపారు. చెరువుల మరమ్మత్తు పనులలో నాణ్యత పాటించి నివేదిక అందజేయా లన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈవో విజయలక్ష్మి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ అధికారులపై ఆగ్రహం

మొరంచ వాగు పై ఉన్న నాలుగు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులలో ట్రాన్స్ఫార్మర్‌లలో దొంగతనం జరిగిన విషయం తెలుసుకొని ఇరిగేషన్ అధీకారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దోషులపై పోలీసులు కేసు నమోదు చేయాలని, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు వద్ద ప్రభుత్వం నుండి ఒక వ్యక్తికి బాధ్యతలు అప్పగించాలని, సీసీ కెమెరా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇటుక బట్టీల యజమానులు చెరువుల నుండి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని కేసు నమోదుతో పాటు వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. అలాగే సీజనల్ వ్యాధుల పట్ల వైద్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వాహపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా అభివద్ధి కోసం సభ్యుల ఆమోదంతో పలు తీర్మానాలు చేశారు.



ఎస్ఈ, ఈఈలను నియమించాలని తీర్మానం

పెద్దపల్లి జిల్లా ఎస్ఈ జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు ఇన్‌చార్జి ఎస్ఈగా పనిచేస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజా ప్రతినిధులు తెలిపారు. దీంతో జిల్లా లోని 11మండలాలకు ఒక ఎస్ఈని, 5 మండలాలకు ఒక ఈఈని, 7 మండలాలకు ఒక ఏఈని నియమించాలని సభ సభ్యులు తీర్మానం చేశారు. ములుగు, భూపాలపల్లి, మంథని మూడు నియోజకవర్గాల పరిధిలోని 36 వేల ఎకరాల్లో గ్యాప్ ఆయకట్టు పనులను చేపట్టడానికి రూ.512 కోట్లతో అంచనాలు తయారు చేశామన్నారు. నిధులు మంజూరు చేయాలని డీబీఎం 38 చివరి అయకట్టు వరకు నీరందించేందుకు ప్రతిపాదనలు తయారు చేసి అందిస్తే నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటా మన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచేలా కృషి.. : జిల్లా అదనపు కలెక్టర్

నవతెలంగాణ - ములుగు

ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక (సంస్థలు) పి శ్రీజ ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం జంగాలపల్లి గ్రామంలో జరిగిన గ్రామ సభ బడిబాట కార్యక్రమంలో పాల్గొని ఆమె మాటాడారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని అన్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ప్రత్యేక గ్రామసభలతోపాటు, గ్రామస్తులు జీపీ సిబ్బంది కూడా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్ ఏర్పాటుచేసి విద్యార్థుల వివరాలు నమోదు చేయాలని అన్నారు. డీఈఓ పణిని, ఎంఈఓ శ్రీనివాసులు, ఎంపీడీఓ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



నిష్పక్షపాతంగా సీట్ల కేటాయింపు

నిష్పక్షపాతంగా బెస్ట్ అవైలబుల్ స్కీం పాఠశాలల సీట్లు కేటాయించినట్టు జిల్లా అదనపు కలెక్టర్ పి శ్రీజ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి తుల రవి ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ స్కీం లో సీట్ల కేటాయింపునకు లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ములుగు జిల్లా పరిధిలో బెస్ట్ అవైలబుల్ స్కీం పాఠశాలలలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్నా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమక్షంలోనే లక్కీ డ్రా తీసినట్టు చెప్పారు. 2024 - 25 విద్యా సంవత్సరానికి గాను ఒకటవ తరగతిలో 20 మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. ఇందులో 11మంది బాలికలు, 9 మంది బాలురు ఉన్నారని అన్నారు. ఐదవ తరగతిలో 22మందికి సీట్లు కేటాయించామని, ఇందులో 11 మంది బాలికలు, 11 మంది బాలురు ఉన్నారని అన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 42 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించినట్టు తెలిపారు. అనంతరం తుల రవి మాట్లాడుతూ... ములుగు మండలంలోని అరవింద పాఠశాల, సాధన పాఠశాల, మంగపేట మండలంలోని ఆదర్శ పాఠశాలలలో ప్రవేశాల కోసం జిల్లా వ్యాప్తంగా 110 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 42 మందికి సీట్లు కేటాయించినట్టు చెప్పారు. జిల్లా సైన్స్ అధికారి జయదేవ్, జాకారం గురుకుల కళాశాల ప్రిన్సిపల్ జెయాదగిరి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడి కేంద్రాల్లో బడిబాట

నవతెలంగాణ-మల్హర్‌రావు



మండలంలోని ఆన్‌సాన్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం అంగన్ వాడీ సూపర్‌వైజర్ సరస్వతి ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. రెండున్నరేండ్లు పైబడిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం లభిస్తుందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు ప్రమీల, రమా, అనూష, ఆయాలు, పాల్గొన్నారు.

అంబటిపల్లి గ్రామంలో బడిబాట

నవతెలంగాణ-మహదేవపూర్



మహాదేవపూర్ మండలంలోని అంబటిపల్లి మండల ప్రజా పరిషత్ పాఠశాల హెచ్ఎం ముండయ్య ఆధ్వర్యంలో మంగళవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు ఎండీమహమ్మద్, కే శోభరాణి, సీహెచ్ కవితా దేవి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మహాదేవపూర్ జడ్పీహెచ్ఎస్ బాలి కల పాఠశాల హెచ్ఎం సరిత ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు ఉపాధ్యాయులు మడక మధు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన విక్రయ షాపులను వ్యవసాయ అధికారుల తనిఖీ



నవతెలంగాణ-గోవిందరావుపేట

మండలంలోని పలు గ్రామాల్లో ఎరువులు, పురుగు మందులు, విత్తనాల విక్రయ షాపులను మంగళవారం ఏడిఏ శ్రీధర్, మండల వ్యవసాయ అధికారి జితేందర్‌రెడ్డి తనిఖీ చేశ్వారు. ఈ సందర్భంగా ఏటూర్‌నాగారం ఏడిఏ శ్రీధర్ మాట్లాడుతూ... సదరు షాపు యజమానులకు పలు సలహాలు సూచనలు ఇచ్చారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు విక్రయాల సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. రైతులకు విత్తనాల పట్ల అవగాహన కల్పించాలని అన్నారు. స్టాక్ రిజిస్టర్లను స్టాక్ బోర్డులపై ఎప్పటికప్పుడు నిలువలు క్రయ విక్రయాల ధరల వివరాలను నమోదు చేయాలన్నారు. షాపులలో రికార్డుల నిర్వహణ పట్ల ఏడిఏ శ్రీధర్ సంతృప్తి వ్యక్తం చేశారు. విత్తనాల కొనుగోలు, అమ్మకంలో షాపు యాజమాన్యం అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా చూసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ఎంపీడీఓ జవహర్ రెడ్డి



నవతెలంగాణ-గోవిందరావుపేట

ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయుల బోధనతో నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడిఓ జవహర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చల్వాయి గ్రామపంచాయతీ ఆవరణలో జయశంకర్ బడిబాట గ్రామ సభ నిర్వహించారు. ఎంపీడీఓ జవహర్ రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు ఉన్నాయని ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని కోరారు. చల్వాయి పీఎస్ ప్రీ ప్రైమరీ సెక్షన్ ఉందని, విద్యార్థులను ఆ పాఠశాలలో చేర్పించాలని అన్నారు. చల్వాయి జెడ్పీహెచ్ఎస్‌లో డిజిటల్ విద్యాబోధన సౌకర్యం ఉందన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను చేర్పించాలని అవగాహన కల్పించారు. చల్వాయి జీపీ పరిధి ప్రభుత్వ ఉపాధ్యాయులు ఈనెల 6 నుండి 11 వరకు ప్రతి ఇంటిని సందర్శించి ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలన్నారు. సమావేశంలో హెచ్ఎంలు చంద్ర రెడ్డి వాసుదేవ రెడ్డి, నాగేశ్వరరావు, సాంబయ్య వేణు గోపాల్ వెంకట లక్ష్మి శ్రీనివాస్‌తోపాటు ఏపీఓ, కార్యదర్శి భారతి అంగన్‌వాడీ సూపర్వైజర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు

బడిబాట గ్రామసభలో
మండల విద్యాశాఖ అధికారి గొంది దివాకర్

నవతెలంగాణ-గోవిందరావుపేట

గోవిందరావుపేట మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం స్పెషల్ ఆఫీసర్ సాహిదా బేగం అధ్యక్షతన బడిబాట గ్రామసభ నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి దేగల శంకర్ గ్రామసభ ఎజెండా చదివి వినిపించారు. 6-6- 2024 నుండి 11-6-2024 వరకు జరిగిన బడిబాట కార్యక్రమ ప్రగతి గురించి చర్చించారు. బడి ఈడు పిల్లలందరూ పాఠశాలల్లో నమోదు చేసేందుకు కృషి చేయడం, బడి బయట పిల్లలను బడిలో చేర్పించడంపై చర్చించారు.



ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి గొంది దివాకర్ మాట్లాడుతూ... ప్రభుత్వం పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించిందని అన్నారు. మధ్యాహ్న భోజనం, రాగి జావా, నోట్ పుస్తకాలు ఉచితంగా ఇస్తున్నారని అన్నారు నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే లభిస్తుందని గుర్తు చేశారు. ఉత్తమ ప్రతిభ కలిగిన ఉపాధ్యాయులు పాఠశాలల్లో ఉన్నారని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తప్పకుండా వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని కోరారు. సెక్టోరియల్ ఆఫీసర్ రాజు మాట్లాడుతూ మన ఊరు మనబడి కార్యక్రమం కింద జిల్లాలో 125 పాఠశాలల్లో ప్రభుత్వం అన్ని సౌకర్యాలతోపాటు డిజిటల్ విద్యా బోధన అందిస్తోందన్నారు. మరో సెక్టోరియల్ ఆఫీసర్ సాంబయ్య మాట్లాడుతూ.... విద్యార్థులకు సామాజిక స్పృహ మానవ సంబంధాలు ప్రభుత్వ పాఠశాలలోనే అందుతాయని అన్నారు. నోడల్ ఆఫీసర్ సోమా రెడ్డి మాట్లాడుతూ గోవిందరావుపేట ప్రభుత్వ పాఠశాలలో కనీసం 30 మంది విద్యార్థులు బడిబాట కార్యక్రమాల్లో చేరతారని ఆశాభావం వ్యక్తం చేశారు. వారందరికీ సొంత ఖర్చులతో టై, బెల్టు, డ్రెస్ అందిస్తామని అన్నారు. సమీప గ్రామాల నుంచి ఈ పాఠశాలలో వచ్చే విద్యార్థులకు ట్రావెలింగ్ అల వెన్స్ వ్యక్తిగతంగా తామే ఇస్తామని అన్నారు. కే రఘురాం మాట్లాడుతూ... ఆవాస ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి బడి ఈడు పిల్లలందరినీ గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చదువుకునేలా కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. స్పెషల్ ఆఫీసర్ సాహిదాబ్ బేగం మాట్లాడుతూ... బాల్యంలో ప్రభుత్వ పాఠశాలలోనే చదివి తాము ఈ స్థాయికి వచ్చామని గుర్తు చేశారు. నాడు నేడు పాఠశాలలకు వ్యత్యాసం ఉందని, నేడు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించిందని అన్నారు. గ్రామంలోని పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్పీలు అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
6
జయశంకర్
ములుగు - భూపాలపల్లి
బుధవారం | జూన్ 12, 2024 | www.navatelangana.com

పెసా గ్రామ సభల ద్వారానే ఏజెన్సీ గ్రామాల అభివృద్ధి

ఐటీడీఏ పెసా కోఆర్డినేటర్ కోమురం ప్రభాకర్

నవతెలంగాణ - ములుగు

పెసా గ్రామ సభల ద్వారానే ఏజెన్సీ గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ఆదివాసీ గ్రామాల పెసా కమిటీలు పనిచేయాలని ఐటీడీఏ పెసా కోఆర్డినేటర్ కోమురం ప్రభాకర్ తెలిపారు. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 244 ప్రకారం ఏర్పడిన పెసా గ్రామ సభల ద్వారానే 5వ షెడ్యూల్డ్ భూభాగం అభివృద్ధి చెందుతుందన్నారు. మంగళవారం ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు ములుగు మండలంలోని వజ్జ రాజు అధ్యక్షతన 7గ్రామ పంచాయతీలలోని అవాస ప్రాంతాల ఉపాధ్యక్ష, కార్య దర్శులు, కుల పెద్దలు, డ్వాక్రా మహిళ సంఘాలు, యూవతి, యువకులు, పెసా మొబిలైజర్ల తో సమావేశం ఏర్పాటు చేశారు. పెసా చట్టం నిబంధనలను అనుసరించి గ్రామ సభలు నిర్వహించాలని కమిటీలకు సూచించారు. గ్రామాలలో కుల పెద్దలు, డ్వాక్రా మహిళా ప్రతినిధులు, యువతీ, యువకులను సమన్వయం చేసుకొంటూ పెసా గ్రామ సభలను బలోపేతం చేయాలన్నారు. మండలం లోని గిరిజన మత్స్య సంఘాలు ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసుకొవాలన్నారు. ఐటిడిఏ ద్వారా గిరివికాసం బోర్లను ఉపయోగించుకొని రెండు పండించుకొని ఆర్థిక పరిపుష్టిని సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వజ్జ రాజు, ములుగు మండల అధ్యక్షులు, డబ్బకట్ల రాజు, ఈసం ముత్తరావు, ఈసం రవి, ఆగబోయిన శ్రీధర్, డబ్బకట్ల రమేష్, పసుల వెంకట్, కులపెద్దలు వజ్జ లక్ష్మయ్య, తవిటి నారాయణ, వాసం పాపయ్య, చేరుకుల రాజన్న, మహిళలు ఎట్టి రజిత, తవిటి లక్ష్మి, జబ్బ యకమ్మ యువకులు వాసం రమేష్, గొంది వినీత్, యాప భాస్కర్, గొంది దాసు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ-గణపురం

గణపురం మండలం బుద్ధారం గ్రామపంచాయతీ పరిధి తిమ్మాపురం వార్డు సభ్యుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొంతం గణపతి ముదిరాజ్ మంగళవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విడిదినేని అశోక్, బీసీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి మాల భద్రయ్య, గణప సముద్రం చైర్మన్ మునగాల రమేష్, మండల నాయకులు అంబటిపల్లి సంపత్ రావు, కొవ్వూరి భద్రయ్య, కనుకుంట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.



'కనుకయ్య.'కు జాతీయ కళారత్న అవార్డు

నవతెలంగాణ-రేగొండ

గోరికొత్తపల్లి మండలం కోనరావుపేట గ్రామానికి చెందిన చిందు యక్షగాన కళాకారుడు గడ్డం కనుకయ్య కళా రత్న నేషనల్ అవార్డు అందుకున్నారు. యక్షగాన కళా రంగంలో 30 సంవత్సరాలుగా కళా ప్రదర్శనలు చేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రదర్శనలు ఇస్తూ కళా రంగంలో విశేషమైన కృషి చేసినందుకు, మహారాష్ట్ర బహుజన సాహిత్య అకాడమీ సంస్థ ఆధ్వర్యంలో పూనే పట్టణంలోని నెహ్రూ సాంస్కృతిక ఆడిటోరియంలో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, స్థానిక ఎమ్మెల్యే రవీంద్ర దండేకర్ చేతులమీదుగా కళా రత్న నేషనల్ అవార్డు అందుకున్నారు. గడ్డం కనకయ్యకు అవార్డు రావడం పట్ల స్థానిక చిందు యక్షగాన కళాకారులు సంతోషం వ్యక్తం చేశారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-మల్హర్‌రావు

మండల కేంద్రమైన తాడిచెర్ల ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో 1993-94 సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు మంగళవారం తాడిచెర్ల పాత హైస్కూలో గెట్‌టుగెదర్ పార్టీ నిర్వహించారు. అలనాటి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.30 సంవత్సరాల క్రితం విద్య బోధన, బుద్ధి మాటలు నేర్పిన గురువులను, ముఖ్య ధితులుగా ఎంపిడిఓ శ్యాం సుందర్‌తోపాటు పలువురు అధికారులను పిలుపించుకొని వారిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. నాటి గురువులు, పూర్వ విద్యార్థులు జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అప్పటి గురువులు, అధికారులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలిసిన శేఖర్

నవతెలంగాణ -తాడ్వాయి



వరంగల్ -ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో విజయం సాధించిన సందర్భంగా సామాజిక కార్యకర్త దబ్బటి శేఖర్ క్యూ న్యూస్ కార్యాలయంలో తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా దబ్బటి శేఖర్ మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలని, అండగా ఉండాలని కోరారు. పట్టభద్రులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలకు నిరంతరం పోరాడాలని సూచించారు.

వివాహిత అదశ్యం.. కేసు నమోదు

నవతెలంగాణ-గోవిందరావుపేట

మండలంలోని పస్రా పోలీస్ స్టేషన్లో మంగళవారం వివాహిత మహిళ అదృశ్యమైన కేసు నమోదయినట్లు ఎస్ఐ ఏ కమలాకర్ తెలిపారు. రాంనగర్ గ్రామానికి చెందిన అజ్మీరా వినోద్‌కి 11 సంవత్సరాల క్రితం కమలపూంకు చెందిన స్వాతి తో వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారి వైవాహిక జీవితంలో తరుచు గొడవలు జరుగుతూ ఉండేవి. ఈ క్రమంలో 09.06.2024న సాయంత్రం భార్య భర్తలకు గొడవ జరగటంతో కోపంతో వినోద్ గోవిందరవుపేటకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి అతని భార్య కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వినోద్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు ఇవ్వగా ఎస్సై కమలాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధితురాలి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే 8712670086లో సంప్రదించాలని కోరారు.

ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పూరిల్లు దగ్ధం

నవతెలంగాణ-రేగొండ

ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పూరిల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని రామన్నగూడెంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బానోతు ప్రియాంక - వీరు నాయక్ దంపతులు ఉదయం ఇంట్లో దీపం పెట్టి పనికి వెళ్ళిపోయారు. ప్రమాదవశాత్తు దీపం కిందపడి ఇల్లు మొత్తం కాలిపోయింది. చుట్టుపక్కల గ్రామస్తులు గమనించి మంటలను ఆర్పారు. అప్పటికే ఇంట్లో ఉన్న 20వేల రూపాయల నగదు తో పాటు, దుస్తులు, బియ్యం, నిత్యవసర సరుకులు కాలిపోయాయని బాధితులు రోధిస్తూ తెలిపారు. ఇల్లు కాలిపోయిన నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకొని పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని గ్రామస్తులు కోరారు.

పాఠశాలల్లో స్వచ్ఛత ఎలా ?

కార్మికుల తొలగింపుతో ఇబ్బందులు
స్థానిక సంస్థలకు బాధ్యతలు అప్పగించిన ఫలితం అంతంతే
నేటి నుంచి పాఠశాలలు పునర్ ప్రారంభం

నవతెలంగాణ-మల్హర్‌రావు

ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛత కార్యక్రమాలను నిర్వహించి స్వచ్ఛ పాటశాలలే లక్ష్యంగా ఏర్పాటు చేయాలను కుంటున్నా... ఆ లక్ష్యం ముందుకు సాగడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్ల శుభ్రతకు ప్రాధాన్యమిస్తూ రాష్ట్ర విద్యాశాఖ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో స్వచ్ఛ కార్మికులు(స్కావెంజర్స్)ను నియమించారు. అనంతరం 2019లో వారిని విధుల నుంచి తొలగించారు. ఆ తరువాత నుంచి నేటి వరకు పాటశాలల్లో స్వచ్ఛత కనిపించడం లేదనే విమర్శలున్నాయి. గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది ద్వారా పాటశాలలను శుభ్రం చేయాలని ఆదేశాలున్న అది పూర్తి స్థాయిలో ఆచరణకు నోచుకోక నేడు పాఠశాలలు పునర్ ప్రారంభం కానున్న నేపథ్యంలో అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి.



మండలంలో ఐదు జిల్లా పరిషత్, రెండు ప్రాథమికోన్నత, ఒక కస్తూర్బా, ఒక మోడల్, 26 ప్రాథమిక పాఠశాలలు మొత్తం 37 పాఠశాలలు ఉండగా 2,060 మంది విద్యార్థులు విద్యానభ్యసిస్తున్నారు. అయితే పాటశాల ఆవరణ శుభ్రం చేయడంతోపాటు మరుగుదొడ్ల శుభ్రం చేసేందుకు స్కావెంజర్లను నియమించగా వారిని తొలగించిన ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులు, మున్సిపల్ కార్మికులు, కార్పొరేషన్ కార్మికులతో పాఠశాలలను,ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రం చేయాలని ఆదేశించింది. వీటిని ఆయా అధికారులతోపాటు, ప్రధానోపాధ్యాయు లు పర్యవేక్షించాలి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు క్షేత్రస్థాయిలో ఎవరు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.గ్రామాల్లో పరిస్థితులకు అనుగుణంగా ఇద్దరు, ముగ్గురు చిన్ని జీపిల్లో ఒక్కరూ చొప్పున కార్మికులు విధులు నిర్వహిస్తుంటారు.వీరంతా ఆయా పాటశాలల్లో శుభ్రం చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చినా ఆదేశాలు అమలు కావడం లేదు.పాటశాలల్లో శుభ్రం చేయకుండా వదిలేస్తున్నారు. దీనివల్ల పాటశాలలకు చెడ్డ పేరు వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలపై అసంతృప్తి వ్యక్తం చేయడంతోపాటు పలుమార్లు విన్నవించినా స్కావెంజర్లను నియమించాలని కోరుతున్నారు. పలుమార్లు తామే తరగతి గదులు శుభ్రం చేస్తున్నామని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పాటశాలలు పునప్రారంభ సమయంలో స్వచ్ఛత పాటిస్తున్నా పలువురు కార్మికులు ఏడాదంతా పాటశాలల్లో పనులు చేసేందుకు ఆసక్తి కనబర్చడం లేదు. పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా రోజు వారి విధుల్లో బిజీగా ఉండి ఆవరణ మాత్రమే శుభ్రం చేస్తున్నారని, మిగతా మూత్రశాలలు, మరుగు దొడ్లు, తరగతి గదుల్లో ఎవరు శుభ్రం చేయాలని, మొక్కలకు నీళ్లు ఎవరు పట్టాలని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.



స్కావెంజర్లను నియమించాలి : యువైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపు యాదవ్

ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛ కార్మికులను(స్కావెంజర్స్)ను వెంటనే ప్రభుత్వం విధుల్లోకి తీసుకోవాలి. వారిని తొలగించడంతో పాటశాలల తరగతి గదుల్లో చెత్త,చెదారంతో పేరుకపోవడమే కాక మూత్ర శాలలు, మరుగుదొడ్లలో అపరిశుభ్రతతో నిండిపోయాయి. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచాలి

జిల్లా విద్యాశాఖ అధికారి జి పాణినిలి

నవతెలంగాణ - ములుగు



2024-25 నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల నోడల్ అధికారులు ,సమస్త యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ అధికారి జీ పాణిని మంగళవారం జిల్లా విద్యాశాఖ పక్షాన పాఠశాల నూతన విద్యా సంవత్సరం ప్రారంభ శుభాకాంక్షలు తెలిపారు. నేటి నుండి 2024-25 నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నూతన ఉత్సాహంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగేలా బడిబాటలో కృషి చేస్తున్నారని అన్నారు. 12 నుండి 19వ తేదీ వరకు జరగనున్న బడిబాట రోజువారి కార్యక్రమాలను విజయవంతం చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచాలన్నారు. ప్రభుత్వ విద్య వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన ఏర్పాటు దాదాపు పూర్తి చేసినట్టు చెప్పారు. విద్యార్థులకు ప్రభుత్వం అందించే పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్ సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాల పున్న ప్రారంభం అవుతున్న నేపథ్యంలో మీ గ్రామ పంచాయతీ పరిధి సిబ్బందితో పాఠశాల ఆవరణను, పైకప్పు పై, పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలు లాంటివి శుభ్రం చేయించుకోవాల్సిందిగా ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ఈ నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అనేది పండుగ వాతావరణంలో, విద్యార్థులకు ఆహ్లాదకరంగా వారిని ఆకర్షించే విధంగా మామిడి తోరణాలతో, బెలూన్లతో, రంగవల్లులతో ఏర్పాట్లు చేయాలన్నారు. పాఠశాల ప్రారంభ కార్యక్రమానికి తల్లిదండ్రులను, గ్రామ పెద్దలను, గ్రామస్తులను, స్వచ్ఛంద సంఘాలను, ప్రజాప్రతినిధులను, స్థానిక అధికారులను ఆహ్వానించాలని కోరారు. అలాగే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫార్మ్ అందజేయాలని కోరారు. మండల విద్యాశాఖ అధికారులు వారి పరిధిలోని అన్ని పాఠశాలలలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం ఘనంగా నిర్వహించేలా తగు ఏర్పాట్లు చేయాలని అన్నారు.

ప్లేస్మెంట్ ఇవ్వ కుండా ఇబ్బందులు పెట్టడం సరికాదు : డీవైఎఫ్ఐ

నవతెలంగాణ - ములుగు



తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పడ గానే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నూతన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని అనేక చోట్ల అనేక సందర్భాలలో చెప్పారని, కానీ ఆయా ఉద్యోగులకు ఇప్పటివరకు ప్లేస్మెంట్ ఇవ్వ కుండా ఇబ్బందులకు గురిచేయడం సరికాదని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు సంజీవ అధ్యక్షతన నిర్వహించిన సమావే శంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎంతోమంది నిరుద్యోగులు 10 సంవత్సరాలుగా కోచింగ్ సెంటర్లలో లక్షల రూపాయలు వెచ్చించి కోచింగ్ తీసుకొని పరీక్షలు రాసి ఎగ్జామ్ పాస్ అయి ఉద్యోగం పొందారన్నారు. ఆయా ఉద్యోగస్తులకు అట్టహాసంగా 4 మార్చి2024న దాదాపు 9,000 మందికి ఎల్బి స్టేడియంలో గురుకుల టీజీటీ పీజీటీ జేఎల్ డిఎల్ పోస్టులకు సంబంధించిన అపాయింట్మెంట్ ఆర్డర్స్ అందజేశారని అన్నారు. కానీ, విద్యా సంవత్సరం ప్రారంభమైనా ఇప్పటివరకు ప్లేస్మెంట్ ఇవ్వకపోవడం హేయమైన చర్య అన్నారు. ఆయా ఉద్యోగులు నాలుగు నెలలుగా పోస్టింగ్ ల కోసం ఎదురుచూస్తూ ఇబ్బందులు పడుతున్నారని దిక్కుతోచని పరిస్థితులలో ఉన్నారని అన్నారు. త్వరగా పోస్టింగులు ఇవ్వాలని కోరారు. కొంత మంది వారి పిల్లలను ఎక్కడ పాఠశాలలో వేయాలా ఎక్కడ అడ్మిషన్స్ తీసుకోవాలో తెలియని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అటు ప్రైవేటు జాబులలో జాయిన్ కాలేక వచ్చిన ఉద్యోగానికి పోస్టింగ్ లేక కుటుంబాన్ని నడపడానికి డబ్బులు లేక అప్పుల పాలవుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అభ్యర్థులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింగ్, చంటి, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

మినీ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం : ప్రిన్సిపాల్

నవతెలంగాణ -తాడ్వాయి

ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని బంధాల జీపీ పరిధి పోచాపూర్ గిరిజన మినీ గురుకుల బాలికల పాఠశాలలో 2024- 25 విద్య సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ నారాయణనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిబిఎస్ఇలో ఫస్ట్ క్లాస్‌లో- 30, సెకండ్ క్లాసులో- 10, థర్డ్ క్లాస్ లో- 10, ఫోర్త్ క్లాస్ లో- 6, ఫిఫ్త్ క్లాస్ లో-7 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. అర్హత గల గిరిజన బాలికలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఒకటవ తరగతి విద్యార్థులకు ఐదు సంవత్సరాలు నిండి ఉండాలని అన్నారు. విద్యార్థులకు ఉచిత భోజనం వసతి యూనిఫామ్, బుక్స్, నోట్ బుక్స్, కాస్మోటిక్స్ ఉచితంగా అందచేస్తామని తెలిపారు. అడ్మిషన్‌ల కొరకు చివరి తేదీ ఈనెల 28వ తేదీ అన్నారు. పూర్తి వివరాలకు 9491653478, 9441776319లో సంప్రదించాలని అన్నారు.

కట్ట మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలి

జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య

నవతెలంగాణ - ములుగు

కేశవాపూర్ చెరువు కట్ట మరమ్మతుకు మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్‌లు నిధులు మంజూరు చేయాలని, నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యం ఇదని జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య మంగళవారం విజ్ఞప్తి చేశారు. గత వర్షాకాలంలో కేశవాపూర్ చెరువు కట్ట తెగిపోయేంత ప్రమాదకర స్థితికి వచ్చిందన్నారు. ఇరిగేషన్ అధికారులు పర్యటించి నివేదిక తీసుకున్నారని, అయినప్పటికీ మళ్ళీ వర్షాకాలం సమీపిస్తున్నా ఎలాంటి మరమ్మత్తు చేయకపోవడం సరికాదన్నారు. రైతు సంక్షేమం కోసం, ప్రజల సంక్షేమం కోసం పని చేయాల్సిన అధికారుల అలసత్వం వల్ల వందలాది ఎకరాల్లో పంటలు పండే పరిస్థితులు లేవన్నారు. దీంతో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని అన్నారు. సకాలంలో నివేదికలు ఇవ్వకుండా నిధులు మంజూరు చేయడంలో విఫలం చెందారని అన్నారు. గతంలో కూడా కేశవాపూర్ గ్రామంలో రైతులకు సంబంధించిన తుమ్మలకుంట అక్రమ బావి విషయంలో లోకాయుక్త కోర్టు బావిని కూడుపాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అధికారుల విచారణలో ఆ అక్రమబావి వల్ల ఆయకట్టు రైతులు నష్టపోతున్నారని, ఇది చట్ట విరుద్ధమని అన్నారు. బావికి సంబంధించిన రైతులే ఒప్పుకున్నప్పటికీ అధికారులు మాత్రం న్యాయస్థానాలకు తప్పుడు నివేదికలు ఇచ్చారని పేర్కొన్నారు. గౌరవ మంత్రి సీతక్క, ములుగు జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి కేశవాపూర్ ఊర చెరువు కట్ట మరమ్మతుకు నిధులు మంజూరు చేసేలా, వెంటనే పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



ప్రొఫెసర్ జయశంకర్ పౌండేషన్ చేయూత

నవతెలంగాణ-మల్హర్‌రావు

మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన బుట్టి శ్యామల రాజ్ కుమార్ యాదవ్ దంపతుల ఏడు నెలల కొడుకు హర్షిత్‌కుమార్ గత నాలుగైదు నెలలుగా లివర్ సమస్యతో బాధపడుతున్నాడు. విషయం తెలుకున్న ప్రొఫెసర్ జయశంకర్ పౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి మంగళవారం తన బృందంతో వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాలుడిని ఆర్థికంగా ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. తమ వంతుగా రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆరఎఫ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-మహాదేవపూర్

మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామానికి చెందిన లేతకరి నల్లగొండకు మంజూరైన రూ.27,000విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం కాంగ్రెస నాయకులు అందజేశారు. ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు లేతకరి రాజబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కామిడీ లక్ష్మి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు హైదర్, యువనాయకులు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుడికి ఎల్ఓసీ అందజేత

నవతెలంగాణ-మహదేవపూర్

మహాదేవపూర్ మండలం పలుగుల గ్రామానికి చెందిన మచ్చ సాయికు మంజూరైన రూ.23000 విలువైన ఎల్ఓసీని మంగళవారం పలుగుల గ్రామంలో కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మానేం మహేష్, మాజీ సర్పంచ్ చంద్రయ్య, డాక్టర్ శంకర్, వద్లకొండ సమయ్య, మచ్చ రాజయ్య, మచ్చ కిష్టయ్య అందజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-మహదేవపూర్

మహాదేవపూర్ మండలం పలుగుల గ్రామంలో ఇటీవల బర్ల మంగ అకాల మరణం చెందారు. మంగళవారం బాధిత కుటుంబాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రయ్య, నాయకులు పాల్గొన్నారు.

పోస్ట్ కార్డు ద్వారా సమస్య... పరిష్కరించిన ఎస్సై

నవతెలంగాణ-గోవిందరావుపేట

పోస్ట్ కార్డు ద్వారా ఓ వృద్ధ మహిళ తన సమస్యను విన్నవించింది. వెంటనే ఎస్సై కమలాకర్ స్పందించి సమస్యను పరిష్కరించారు. వివరాల్లోకెళ్తే... మంగళవారం మచ్చాపూర్ గ్రామానికి చెందిన 92 సంవత్సరాల వృద్దురాలు కుమ్మరి కుంట్ల నరసమ్మ తన నలుగురు కుమారులు పట్టించుకోవడంలేదని పోస్ట్ కార్డు ద్వారా పోలిస్ స్టేషన్‌కు తెలియజేసింది. వెంటనే స్పందించి మచ్చాపూర్ గ్రామానికి చేరుకొని నరసమ్మ కుమారులను పిలిపించి మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ఆధునిక యుగంలో సెల్ ఫోన్లు, వాట్సప్ మెసేజ్ లు ఉన్న తరుణంలో వృద్ధురాలు పోస్ట్ కార్డును ఆశ్రయించి తన సమస్యను పోలిస్ స్టేషన్‌కు వివరించడం ఎస్సై పరిష్కరించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తాత్కాలిక ప్రాతిపదికన హిందీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-గోవిందరావుపేట

మండలంలోని చల్వాయి మోడల్ స్కూల్‌లో 6 నుండి 10 వ తరగతి వరకు హిందీ బోధించేందుకు తాత్కాలిక ప్రాతిపదికన ఉపాధ్యాయుడి పోస్టు భర్తీ చేస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎండి నిజాముద్దీన్ మంగళవారం తెలిపారు. జీతం రూ.18200 ఉంటుందని, ఆసక్తి ఉన్న వారు నేడు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాఠశాలలో డెమో, ఇంటర్వ్యూ కు హాజరు కావాలని సూచించారు.

ఐటీఐలో ప్రవేశం కోసం దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటిడిఏ

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌ద్వారా అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్ 20, సివిల్ 24, ఫిట్టర్ 20, వెల్డర్ 40, మెకానిక్ డిజిల్ 24 సీట్లకు ఆసక్తిగల ఉన్న అభ్యర్థులు వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. వెబ్ సెట్ ద్వారా 14వ లోపు ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.